
# శాంతి ప్రార్థన



మూలము :

**పూజ్యశ్రీ స్వామి ఓంకార్**

వ్యాఖ్య :

**స్వామిని వినమ్రానంద సరస్వతి**

ప్రథమ ప్రచురణ 2001
ద్వితీయ ప్రచురణ 21-1-2017 శ్రీశాంతి ఆశ్రమ శతాబ్ది ఉత్సవాలు 21-1-2016 - 21-1-2017 సందర్భంగా...

ప్రతులు : 1000

ప్రకాశకులు
ద మిషన్ ఆఫ్ పీస్
**శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 7382009962

సర్వహక్కులు ప్రకాశకులవి.
ముద్రణ :
**మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి.**

## కృతజ్ఞతాభివందనములు

**ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయం అందించిన వారు**
**పూజ్యశ్రీ స్వామిని చంద్రానందమాతాజీ, ఆనంద ఆశ్రమం.**
**వారికి భగవంతుని ఆశీస్సులతోపాటు,**
**బ్రహ్మలీన పరమపూజ్యశ్రీ ఓంకార స్వామి,**
**పూజ్యశ్రీ జ్ఞానేశ్వరిమాతాజీవారు ఆశీస్సులు అనుగ్రహించుగాక!**
-ఆశ్రమ యాజమాన్యం

# నివేదన

**–పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ**

లోకశాంతి ప్రార్థన పూజ్యశ్రీ స్వామీజీ హృదయాంతరాళము నుండి వెలువడినది. ఇది ఉపనిషత్తుల యొక్క సారాంశము.

ఏ ప్రార్థనతోనైనా భగవంతునితో ఏకత్వమును పొందగల్గిన జీవితములే ధన్యమైనవి. ఆశ్రమానికి ఏ భక్తులు వచ్చినా పూజ్యశ్రీ స్వామీజీ ప్రప్రథమమున శాంతి ప్రార్థనను స్మరింపజేయించెడివారు. ఈ శాంతి ప్రార్థన వార్కి అంత సన్నిహితమైనది.

ఈ ప్రార్థనలో రూపనామములు లేవు. ఏమతస్థులైనా ఆనందముతో స్మరింపవచ్చును. పవిత్రమైన నిర్మల హృదయాలతో ప్రార్థనలో ఉన్న భావ గంభీరతను అనుభవించుచూ స్మరించిన ఆనందయుతమైన శాంతిని బడయ గలరు.

చాల సంవత్సరముల క్రిందట కాశ్మీర దేశము నుండి డాక్టరు అత్రి అనే భక్తుడు "స్వామీజీ మీరు పంపిన శాంతి ప్రార్థనను (Peace Prayer) 108 మార్లు స్మరించిన సమాధి స్థితి గల్గినట్లున్నది" అని వ్రాసిరి.

ఆ విధముగా ఎందరో భక్తులు శాంతిని పొందగల్గుతుండిరి. ఈ శాంతి ప్రార్థన సుమారు ఇరువది భాషలలో ఉన్నది. ఏ ప్రాంతము వారు ఆ ప్రాంత భాషలో స్మరించుచూ శాంతిని బడయు చుండిరి.

మా స్వామిని వినమ్రానంద సరస్వతి ఎంతో భక్తి, శ్రద్ధలతో చక్కగ ఈ శాంతి ప్రార్థనకు వ్యాఖ్యానము వ్రాయగల్గుట కేవలము శ్రీ స్వామి అనుగ్రహమే ! ఆమె కృషి ఫలితముగ భక్తులందరూ శాంతి ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను, సారాంశమును గ్రహించి, అనుభవించి తరించెదరు గాక యనియే మా ప్రార్థన.

భగవంతుడు అందరిని శాంతి, సౌఖ్యములతో సదా బ్రోచుగాక !

ఓం ! ఓం ! ఓం !

# వినమ్రమైన ప్రార్థన

ప్రాతఃకాలమునందు లేచి పరమాత్ముని గూర్చి అర్థించుటయే ప్రార్థన యని చెప్పబడును. ఐతే దేవుని దేనికొరకు అర్థింపవలయును ? ధనముకొరకా? భోగభాగ్య ముల కొరకా? లేక ఐహికవాంఛలను తీర్చుకొనుటకా ? కాదు కాదు, శాంతి సముపార్జన కొరకు ప్రార్థింపవలయును. ధనమువల్ల శాంతి కలుగునా? కలుగదు, సరికదా! అశాంతి పెంపొందును. భోగభాగ్యముల వల్ల శాంతి కలుగునా? కలుగదు, సరికదా ! రాగద్వేష ములు ప్రబలును. ఇక ఐహిక వాంఛలను తీర్చుకొనుటచే శాంతి కలుగునా? కలుగదు. సరికదా ! శారీరక వ్యాధులు, మానసిక వ్యాధులు ఉత్పన్నములగును.

కావున పరమాత్ముని మనము దేని కొరకు ప్రార్థింపవలయును ? మనమెవరమో తెలిసి కొనుటకు ప్రార్థింపవలయును. మనలో నున్న హృదయేశ్వరుని గుర్తెరుంగుటకు ప్రార్థింపవలయును. 'సోఽ హం' భావమును అభివృద్ధి నొందించుకొనుటకు ప్రార్థింపవల యును, అప్పుడు మన జీవితములో శాంతి ప్రవేశించును.

ఇది ఎట్లు సాధ్యమగునో తెలుపుటకే పరమపూజ్యశ్రీ ఓంకారస్వాముల వారు "శాంతిప్రార్థన" ను మన ముందుంచిరి. ఈ ప్రార్థన యందు స్వార్థ మనునది మచ్చుకైనను కానబడదు. జాతిభేదముగాని, కులభేదముగాని, మత భేదముగాని అసలే కానరాదు. ఇది సర్వమత సమ్మతమైనది. దేవుడు "ఇందు గలడందులేడను సందేహము వలదు" అనుపోతనామాత్యుని వాక్యమును నిరూపించునట్టిది.

ఇట్టి మహత్తరమైన "శాంతిప్రార్థన" కు శ్రీ స్వామిని వినమ్రానంద గారు వ్యాఖ్యను వ్రాసిన విషయము తెలిసి ఆనంద కందళిత హృదయారవిందుడనైతిని. కారణమేమనగా ఈ ప్రార్థన కేవలము నోటితో ఉచ్చరింపబడునట్టిది కాదు. ఇది ఆధ్యాత్మిక సాధకులంద రును తమ జీవితములలో ఆచరించి, ఆనందించుటకై ఉద్దేశింపబడినది, శాంతి,సంతో షము, తృప్తి, ఉత్సాహము, ఆనందము ఇవన్నియును పర్యాయపదములని చెప్పవచ్చును.

ఈ "శాంతిప్రార్థన"కు వ్యాఖ్య "శాంతి జీవనము"నకు వ్యాఖ్య వంటిది. ఈ వ్యాఖ్యను సాధకులు, భక్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు పఠించి, వినమ్ర జీవనులై పరమానంద ప్రాప్తి నొందించు ఈ "శాంతి ప్రార్థన"ను హృదయంగన మొనర్చుకొందురు గాక !

ఓం తత్సత్

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇట్లు
**స్వామి హంసానంద**

# విన్నపము

ఓం నమో భగవతే ఓంకారాయ

భగవత్ స్వరూపులైన పూజ్యశ్రీ ఓంకార స్వామి వారి గురించి, వారు వ్రాసిన "శాంతిప్రార్థన" గురించి తెలుసుకోవడం అంటే అనంతమైన సముద్రపు లోతును కొలవటానికి సాహసించినట్లే ! శాంతి ప్రార్థనకు వ్యాఖ్యను అందజేయాలనుకోవడం సాహసమే. అయినా ఎందరో తపోధనులు, జ్ఞానులు, మహాత్ములు, అందరూ, ఆధ్యాత్మిక మార్గములో ఇప్పుడే ఓనామాలు నేర్చుకుంటున్న నా ప్రయత్నాన్ని మనసారా ఆమోదించగలరని నా విన్నపము. పూజ్యశ్రీ స్వామి శివానందజీ, పూజ్యశ్రీ స్వామి చిదానందజీ, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ, మరియు పూజ్యశ్రీ శారదా ప్రియానందజీ, పూజ్యశ్రీ చిన్మయానందజీ మరియు ఎందరో మహాత్ముల ఉపదేశాలను ఈ ప్రార్థన ఆధారంగా తీసుకొని వ్యాఖ్యానించడం జరిగింది. మహాత్ములందరికి నా నమస్సులు ఒక్కటియే సమర్పించగలను. ఈ వ్యాఖ్యలో ఏమైనా తప్పులుంటే అవి నా బుద్ధికి చెందినవిగా గ్రహించి నన్ను క్షమించి ఒప్పులేవయినా ఉంటే పూజ్య గురుదేవుల వారివని భావించి మన్నించవలసినదిగా నా విన్నపము.

ఈ వ్యాఖ్యను ముద్రించడానికి సహకరించిన వారికి ఈ వ్యాఖ్య ముద్రణకు ఆర్థికముగా సహాయము అందించిన వారికి నా ధన్యవాదములు.

అనంత సూర్యునకు కర్పూర నీరాజనము ఇచ్చినట్లే, ఈ చిన్ని వ్యాఖ్య గురుదేవుల పాదపద్మములకు సమర్పితం.

జై గురుదేవ అర్పణమస్తు.

ఇట్లు

పాదదాసి

**–వినమ్రానంద సరస్వతి**

# శాంతి ప్రార్థన

## ఉపోద్ఘాతము

ప్రతీ వ్యక్తి శాంతికావాలని ఆశిస్తాడు. అనేక కోటానుకోట్లు సంపాదించిన ప్రతివ్యక్తికూడ శాంతి కోసమని పరితపిస్తాడు. శాంతికోసమని బాహ్యంగా వెతకడానికి ప్రయత్నిస్తాడు. శాంతి కావాలని హోటళ్లకు, క్లబ్బులకు, సినిమాలకు వెళతారు. శాంతి బాహ్యముగా ఎక్కడను లేదు, మనలోనే ఉన్నది. ప్రతి వ్యక్తి శాంత స్వరూపుడే, కాని అజ్ఞాన ఆవరణచే తన సహజశాంత స్వరూపాన్ని మరచి శాంతి పొందాలని బయట శోధిస్తున్నాడు. బయట శాంతి కావాలని శోధిస్తే శాంతి ఎట్లా లభిస్తుంది?

శాంతి మనలోనే ఉందా ! అది ఎట్లా ? శాంతి మనలోనే ఉంది అనే విషయాన్ని కొన్ని ఉదాహరణల ద్వారా తెలుసుకుందాము.

**"రాజగృహ భోజనాదిషు తథైవ దృష్టత్వాత్"** (నా.భ.సూ. అ2.)

ఉదాహరణ1 : అవంతి నగరమును ఒకానొక రాజు పరిపాలించుచుండెను. ఆ రాజునకు ఒకపుత్రుడు కలిగెను. విధివశాత్తు ఆ రాజపుత్రుని దొంగలు అపహరించిరి. వాడు ఏదో విధముగా ముని ఆశ్రమమునకు చేరుకొనెను. ఆ మునీంద్రుడు రాజకుమారుని పెంచుచుండెను. ఆ బాలుడు తాను ముని యను భావముచే ప్రవర్తించుచుండెను.

ఒక దినమున అవంతి నగర మంత్రి ముని ఆశ్రమమునకు వచ్చెను. ఆ మంత్రి మునిపుత్రుడను చూసి, నీవు ముని పుత్రుడవు కావు, అవంతి నగర రాజపుత్రుడవని తెలిపెను. తాను ఎప్పుడయితే రాజపుత్రుడనే భావన కలిగినదో, అతనిలో శౌర్యము, వీరత్వము, పరాక్రమము కలిగి తన రాజ్యముకేగి అవంతి నగర సింహాసనమును అధిష్ఠించెను.

ఉదాహరణ 2 : ఒక గృహస్థు స్వగృహమును విడిచి దేశాంతరమునకేగి కొన్ని సంవత్సరముల పిదప స్వగృహము చేరుకొనెను. వాడు దేశాంతరము వెళ్ళిన తరువాత వాని స్వగృహము ఉన్నది ఉన్నట్లే ఉండెను. దేశాంతరము వెళ్ళుట కారణముగా తాను అనుభవించిన సుఖము మాత్రము దూరమయ్యెను. వాడు ఇల్లు చేరిన వెంటనే పూర్వ అనుభవము కలిగెను.

ఉదాహరణ 3 : ఆకలి బాధ కలిగినప్పుడు ఆహార మొసగిన ఆకలి బాధ తొలగుచున్నది. కాని నూతన తృప్తి కలుగుటలేదు. తృప్తి సహజము. ఆకలి బాధ నూతనమైనది. క్షుద్బాధ తొలగినప్పుడు సహజమైన తృప్తి యన్నది యున్నట్లే ఉన్నది.

పై మూడు ఉదాహరణలు మనకు ఏమి తెలుపుచున్నవి ?

**"న తేన రాజ పరితోషః క్షుదాశాంతిర్వా"** (నా. భ. సూ.అ2)

1. నీవు ముని పుత్రుడవు కాదనుట చేత నూతనముగా రాజ పదవి పొందలేదు.

2. దేశాంతరము వెళ్ళిన గృహస్థు కొన్ని సంవత్సరముల పిదప స్వగృహము చేరిన తరువాత నూతనముగా స్వగృహ సుఖ అనుభవమును పొందలేదు.

3. క్షుద్బాధ తొలగినప్పుడు నూతనముగా తృప్తి పొందలేదు. తృప్తి సహజము.

**రాజపుత్రుడు - పరమ శాంత స్వరూపుడు**
**మునిపుత్రుడు - జీవుడు**
**దొంగలు - అజ్ఞానము**
**మంత్రి - గురువు**

తాను రాజపుత్రుడు, కాని దొంగలు అపహరించుటచేత తన సహజ స్వరూపాన్ని మరచి ముని ఆశ్రమమునందు తాను మునిపుత్రుడనే భావనచే ప్రవర్తించుచుండెను. ఎప్పుడైతే మంత్రి వచ్చి నీవు మునిపుత్రుడవు కావు, రాజపుత్రుడవు యని తన సహజ స్వరూప స్థితి బోధించినపుడు తాను ముని స్వభావమును వీడి తన సహజ స్వరూపమైన రాజపదవి (శాంతి సామ్రాజ్య సింహాసనము) అధిష్ఠించెను. మునిపుత్రుడు ఎక్కడనో లేదు, జీవుడే మునిపుత్రుడు. అజ్ఞాన మనే దొంగలు జ్ఞానమును అపహరించుటచేత తాను ముని యను భావనచే మెలగు చుండెను. ఎప్పుడయితే మంత్రి (గురువు) వచ్చి స్వరూప జ్ఞానమును బోధించెనో, ఆత్మ సామ్రాజ్య పదవిని అధిష్ఠించెను.

ఎలా అయితే మంత్రి వచ్చి రాజపుత్ర స్వరూపాన్ని గుర్తుచేసి ముని యను భావన దూరం చేసాడో, అదే విధంగా పూజ్య ఓంకార స్వామీజీవారు అశాంతితో సతమత మవుతున్న మానవాళి **"శాంతిప్రార్థన"** ద్వారా

**"పరమశాంతిని"** పొందుటకుగాను, వారు పరమమైన శాంతిని అనుభవించి, సూర్యుని తాపముచే వేడెక్కిన కర్కశమైన భూమిని చంద్రుడు చల్లబరచి నట్లు, స్వామీజీ వారు చంద్రునివలే అవ్యాజ కరుణార్ధ హృదయముతో భావితరముల వారు పరమశాంతిని పొందుటకు శాంతిప్రార్థనను అందించిరి.

శాంతి ప్రార్థన సామాన్యమైనదికాదు. దాని అర్థము గ్రహించని వారు "నేత్రములకు నేత్రము" ఏమిటి యని భావిస్తారు. నారికేళపాకము, ద్రాక్ష పాకము అని రెండు ఉన్నవి. నారికేళపాకము అంటే టెంకాయ నీరు. టెంకాయనీరు సేవించాలి అంటే దానిపై పీచుతీసి ఎంతో శ్రమిస్తే కాని టెంకాయ నీరు లభ్యము కాదు. ద్రాక్షపాకము అంటే ద్రాక్షరసము. ద్రాక్షరసము సేవించాలి. అంటే ఒక్క నిమిషమాత్రములో పళ్ళను ముద్దచేసి ద్రాక్షరసమును సేవించవచ్చును.

వేదములు, ఉపనిషత్తులు గ్రహించాలి అంటే టెంకాయ నీరు సేవించడానికి శ్రమించినట్లు చాలా శ్రమపడాలి. సూక్ష్మబుద్ధి కలవారు మాత్రమే వేదములను, ఉపనిషత్తుల భావాలను గ్రహించగలరు. అందుకని పూజ్య స్వామీజీవారు ఈ శ్రమను గ్రహించి వేదముల, ఉపనిషత్తుల సారాంశాన్ని వెన్నలాగ గ్రహించి ద్రాక్ష పాకము అందించినట్లు మనకు అందించిరి. ఈ శాంతి ప్రార్థన "కేన", "చాంధోగ్య" ఉపనిషత్తుల సారాంశాన్ని సరళముగా, మృదువుగ, మధురాతి మధురమైన ఉపనిషత్తులనే ద్రాక్షామృతాన్ని అందిస్తుంది. అందరము ద్రాక్షామృతాన్ని ఆస్వాదించి పరమమైన శాంతిని పొందెదము గాక !

**శాంతి ప్రార్థన అంటే**

జీవభావము అంతరించి జననమరణక్లేశములను దాటి పరమ శాంతిని పొందుటకు చేయు ప్రయత్నము ఏదయితే ఉందో అదియే శాంతి ప్రార్థన.

**శాంతి అంటే ఏమిటి ?**

ఎటువంటి విషమపరిస్థితులలో అయినా మనస్సు ఏ మాత్రము కలత చెందకుండా అలజడి లేకుండా మనస్సును సౌమ్యస్థితిలో ఉంచగలగడమే శాంతి అని అంటారు.

ప్రతీ వ్యక్తి ఇంద్రియ భోగవస్తువులు, పరిస్థితులు అనుగుణంగా ఉంటే శాంతంగా ఉంటాడు. ఏమాత్రము పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా

అశాంతి చెలరేగుతుంది. అలా కాకుండా ఎటువంటి పరిస్థితులలో అయినా శాంతంగా ఉండగల రహస్యాన్ని ఏ వ్యక్తి అయినా సాధించగలిగితే అతడు తన శాంతి విషయంలో బాహ్య ప్రపంచముపై ఆధారపడి ఉండడు. అంత రంగంలో సర్వ స్వతంత్రంగా శాంతిగా ఉండగలుగుతాడు.

## పరమమైన శాంతి అంటే ఏమిటి?

ఆది శంకరాచార్యులవారు 'పరతత్త్వాన్ని' శాంతం=పరమశాంతం అనే పదంతో వివేకచూడామణిలో నిర్వచించారు.

శాంతి అనే పదాన్ని పరతత్త్వమని ఎలా నిర్వచించారు? అంతరంగంలో భావనాతరంగాలు నర్తించడం వలన శాంతి చెదిరిపోయి అశాంతి ప్రవేశి స్తుంది. ఆత్మతత్త్వం మనస్సునకు అతీతమైనది కావడంచేత మనస్సులోని అశాంతితో దానికి ఎటువంటి సంబంధమూ ఉండదు. అందుచేతనే ఇక్కడ పరతత్వం పరమశాంతం అనే పదంతో సూచించబడినది.

దివ్యమైన ఆత్మానుభవంలో అలజడికి, అశాంతికి కారణమైన రజో గుణం నశించడంతో పరమశాంతి మాత్రమే సహజంగా ఉంటుంది. ఆత్మ దర్శనంతో అన్ని అలజడులు అదృశ్యమయి పోతాయి. ఇక మిగిలి ఉండేది పరమశాంతి మాత్రమే.

## శాంతి వలన ప్రయోజనము

మనస్సు అలజడిగా, అశాంతిగా ఉంటే వ్యక్తియొక్క బుద్ధిప్రకాశం మందగించి ఉంటుంది. మనస్సు శాంతిగా నిశ్చలంగా ఉంటే బుద్ధి ప్రకాశ వంతంగా సమర్థవంతంగా ఉంటుంది. మనస్సు ఎంత శాంతంగా ఉంటే బుద్ధి అంత ప్రకాశవంతంగా ఉంటుంది. అందుకే శ్రీ త్యాగరాజ స్వామివారు "శాంతము లేక సౌఖ్యము లేదు" యని కీర్తన ద్వారా తెలియపరచారు. శాంతము గల వ్యక్తి ఏ రంగములోనైనా విజయాన్ని సాధించగలడు.

శాంతి, పరమశాంతి అనే పదాలకు నిర్వచనం తెలుసుకున్నాం. శాంతి ద్వారానే పరమమైన శాంతిని (ఆత్మతత్త్వాన్ని) తెలుసుకోగలము. అందుకే స్వామీజీ వారు చాల చోట్ల "శాంతోఽయాత్మ" అని బోర్డులు ఆశ్రమంలో పెట్టారు. ప్రతీవ్యక్తి శాంత స్వరూపుడనే భావాన్ని గుర్తు చేయడానికి పెట్టారు.

ప్రతీ వ్యక్తి పరమమైన శాంతి స్వరూపము గలవాడే ! కాని తన పరమ శాంతి స్వరూపాన్ని అజ్ఞానంలో ఏ విధంగా మరచిపోయాడో, శంకరులు సూచిస్తున్నారు.

**అఖండ నిత్యాద్వయ బోధశక్త్యా**
**స్ఫురంతమాత్మాన మనంత వైభవమ్ ।**
**సమా వృణోత్యావృతి శక్తి రేషా**
**తమోమయీ రాహురివార్క బింబమ్ ॥** (వి.చూ. శ్లో 114)

తాత్పర్యం : ఆవృత్తి స్వభావం తమస్సు. ఇది రాహువు. సూర్యుని ఆవరించినట్లుగా అనంతము, అఖండము, నిత్యము, అద్వయము, అనంత శక్తియుతము అయిన ఆత్మను ఆవరిస్తోంది.

మహోత్తరమైన శాంత్యోఽ యాత్మకు పరిణామంలేదు. ఇదినిత్యం, ఇది ఏకం, అద్వయం, మహత్తరమైన సత్యం మననుండి ఎప్పుడూ దూరంగా లేదు. ఈ చైతన్యం మనలో ఎప్పుడూ ఉన్నప్పటికీ దానిని ఆవరించిన తమో గుణ ప్రభావం వలన ఇది మనకు స్ఫురించడం లేదు. ఇంత గొప్పదయిన ఈ చైతన్యం తమస్సుచే ఏ విధంగా ఆవరింపబడింది? అజ్ఞానాన్ని ఎలా కప్పి వేయగలుగుతోంది? ప్రకృతిలోని ఒక ఉదాహరణతో రాహువు రవిని దాచినట్లుగా ఆత్మ తమస్సుచే ఆవరింపబడుతోందని ఇక్కడ శంకరులు వివరిస్తున్నారు. (రాహు రివార్క బింబం).

సూర్యగ్రహణం గురించి హిందువుల పురాణాలలో ప్రత్యేకమయిన కవితా రీతిలో వివరించబడింది. రాహువు అనే రాక్షసునికి తలమాత్రమే ఉంది. మొండెం లేదు. గ్రహణ సమయంలో ఈ రాక్షసుడు సూర్యుని మ్రింగేస్తాడు. అయితే అతనికి మొండెంలేని కారణంగా సూర్యుడు కంఠం ద్వారా బయటకు వచ్చేస్తాడు. విజ్ఞాన శాస్త్రము, కవిత్వము పాలు తేనెవలె ఇక్కడ కలసిపోయాయి.

సూర్యునికి, భూమికి మధ్యగా చంద్రుడు వచ్చినప్పుడు అది సూర్య గ్రహణం అనబడుతుంది. ఇచ్చట నిజానికి జరిగేదేమిటంటే చంద్రుడు మన దృష్టికి అడ్డుగా వచ్చి సూర్యుణ్ణి కనబడకుండా చేస్తున్నాడు. నిజానికి చంద్రుడు సూర్యుని ఎలా కప్పివేయగలుగుతాడు? సూర్యుని కంటే చంద్రుడు ఎంతో చిన్నవాడు. అందుచేత సూర్యగోళాన్ని కప్పడంలేదు. అయితే, సూర్యుడు

ఎంతో దూరంగా ఉండడంచేత చంద్రుడు చాలా దగ్గరగా ఉండడంచేత, అంతే కాకుండా చూసే మనిషి ఈ రెండింటి కంటే పరిమాణంలో చాలా చిన్నగా ఉండడం వలననూ సూర్యుని చంద్రుడు దాచివేసినట్లుగా కనిపిస్తుంది.

ఏది ఏమయినా మన దృక్పథం నుండి చంద్రుడు సూర్యుణ్ణి ఆ సమయంలో అడ్డుకుంటున్నాడు. మన దృష్టితో చూస్తే సూర్యుడు పూర్తిగా కప్పబడి పోయాడు. చంద్రుని నీడనుండి కొంచెం దూరం పోయి మనం చూడగలిగితే సూర్యుణ్ణి చంద్రుడు ఏ మాత్రమూ కప్పివేయడం లేదని స్పష్టంగా గుర్తించ గలుగుతాము. చంద్రునికంటే మీదుగా ఆకాశంలోకి పోగలిగినవారికి సూర్య గ్రహణమే ఉండదు. హిందూపురాణ పరిభాషలో చంద్రుడు మనస్సుకు అధిదేవత. సర్వాన్ని ప్రకాశింపజేసే సూర్యుని ఆత్మతో పోలుస్తారు. పై ఉదాహరణను మనలో మనం సరిచూసుకుంటే నాకు నా ఆత్మకు మధ్యగా ఈ మనస్సు ఉన్నంతకాలము ఆత్మ అనే సూర్యుడు గ్రహణంలో ఉండిపోయినట్లే. నాకెన్నటికి ఆత్మతత్త్వం అర్థంకాదు. తమస్సు వలన పరమశాంతి కప్పబడుతుంది. ఈ అజ్ఞానమే (అవిద్య) నాలో మనస్సుగా వ్యక్తమౌతుంది. మనస్సును అధిగమించ గలిగితే అనేకత్వం లేనేలేదు. పరమశాంతి పొందితే అన్ని బాధలు అంతరిస్తాయి.

## తమస్సు నుండి పరమశాంతి పొందడానికి మార్గము ఏది?

**సతిసక్తో నరోయాతి సద్భావం హ్యేక నిష్ఠయా**

**కీటకో భ్రమరం ధ్యాయన్ భ్రమరత్వాయ కల్పతే.** (వి.చూ.శ్లో359)

కీటకం నిత్యం దీక్షగా భ్రమరాన్ని ధ్యానించడం వలన ఏవిధంగా భ్రమరత్వాన్ని పొందుతుందో, అదేవిధంగా ఆత్మను గురించి నిరంతరం చింతించేవాడు ఆత్మతత్వాన్ని పొందగలుగుతాడు.

ఒక కీటకం భ్రమరం గురించి తీవ్రంగా ఆలోచించడం వలన భ్రమరంగా మారిపోతుంది. భ్రమరాలు గూడును నిర్మిస్తాయి. ఆ మట్టిగూటిలో పురుగును యుంచి ఒక చిన్న కన్నం కనబడేటట్లుగా ఉంచి, మిగిలిన భాగాన్ని పూర్తిగా కప్పివేస్తాయి. ఆ కన్నంలోనుంచి పురుగును దీక్షగా చూస్తూ కాపలా కాస్తూ ఉంటుంది. లోపల ఉండే కీటకానికి ఈ చిన్న ద్వారము ద్వారా భయంకరంగా కాపలా కాసే భ్రమరము తప్ప మరేమీ కనిపించవు.

ఆ కీటకం నిత్యము భ్రమరాన్నే చూస్తూ ఆలోచిస్తూ ఉంటుంది. ఎప్పుడైనా తప్పించుకోవాలని ప్రయత్నిస్తే భ్రమరం దానిని కుడుతూ, హింసిస్తూ ఉంటుంది.

మనకు ఎప్పుడైనా అది కుట్టడం అనుభవమయితే ఆ బాధ ఎంతటిదో తెలుస్తుంది. ఒకమారు కుడితేనే 5,6 అడుగుల పొడుగు మనిషి, 250పౌన్ల బరువు ఉన్న మనిషి ఎంతో బాధకు లోనయి గోల పెడుతూ ఉంటే, అత్యల్ప మయిన ఆ కీటకపు పరిస్థితిని ఏమని ఊహించగలం. ఈ విధంగా భ్రమరంచే హింసింపబడుతూ సదా దానినే ఆ కీటకం ధ్యానిస్తూ ఉంటుంది. అనన్య భక్తితో,ఏకాగ్రతతో నిరంతరము చింతిస్తూ ఉంటుంది. ఈ విధంగా ధ్యానిం చడం మూలంగా చివరగా భ్రమంగా మారుతుంది. ఎప్పుడయితే కీటకం భ్రమరంగా మారుతుందో దానికి ఆ గూటిని పగులకొట్టి పైకి రాగలశక్తి లభిస్తుంది. గూటిని పగులగొట్టి బయటకు వచ్చి ఎగిరిపోతుంది.

భ్రమరాలు తీసుకు వచ్చేకీటకాలు నిజానికి భ్రమరంగా మారడానికి తగివున్నవే. భ్రమరం యొక్క గ్రుడ్డే ఆదశను దాటి పురుగుగా మారిన తరువాత తీసుకువచ్చి గూటిలో బంధించి దానిని జాగ్రత్తగా సంరక్షిస్తూ భ్రమరంగా మారడానికి తల్లి ఈగ దోహదం చేస్తుందని జంతుశాస్త్ర పరీక్షకులు నిర్ధారణ చేశారు.

వేదాంత తత్త్వజ్ఞులు వారి కవితా దృష్టిలో ఈ ఉదాహరణను గ్రహించి నికృష్టంగా పురుగువలె ఉండి చూచేవాడు, అనుభవించేవాడు, ఆలోచించే వాడు జీవుడు. అనంతము అఖండము అయిన పరమశాంత స్వరూపాన్ని , తన్ను తాను తెలుసుకోవడానికి ఈ ఉదాహరణతో పోల్చి బోధించారు. సతి-సక్తః-సత్యాన్ని తెలుసుకోవడానికి జీవితాన్ని అంకితం చేసినవారు ఏకాగ్రమయిన మనో బుద్ధులతో సదా బ్రహ్మ గురించి చింతిస్తూ, ధ్యానిస్తూ, బ్రహ్మం అయిపోతారు. ఇక్కడ అయిపోవడం అనే పదాన్ని ఒక స్థితి నుండి మరొక స్థితిలోనికి మారడంగా అర్థం చేసుకోకుండా జాగ్రత్త వహించాలి. అంతవరకూ తాను ఆత్మగా భావిస్తున్న తత్త్వపు పరిధి విశాలమయి, వ్యాపించి చివరగా విశ్వవ్యాప్తంగా తానే ఉండడాన్ని గుర్తిస్తుంది.ఏ విధంగా కీటకంలో భ్రమరత్వం నిగూఢంగా ఇమిడి ఉందో అదేవిధంగా ప్రతీ వ్యక్తిలోను అనంతమై "శాంత్యోయమాత్మ" అణిగి ఉంది. కాని ఎంతో కృషితో నియమ

నిబంధనలకు లోనయి, సాధనను కొనసాగిస్తేనే ఆధ్యాత్మిక వ్యక్తిత్వం వికసిస్తుంది, పుష్పించి ఫలిస్తుంది. ప్రతి కీటకమూ భ్రమరంగా మారడం లేదు. అయినప్పటికీ ప్రతికీటకంలోనూ భ్రమరంగా మారే శక్తి ఇమిడి ఉంది.

కీటకంలో సహజంగా భ్రమరత్వం ఇమిడి ఉండడం వలననే కీటకం ఎంతోకాలంధ్యానంలో మారుతూ సహనంతో వేచి ఉండి చివరగా భ్రమరంగా మారుతుంది. మానవ కీటకంలో గూడ దివ్యశక్తి నిగూడంగా అణిగి ఉండడం వలననే సదా పరమాత్మ తత్త్వాన్ని ఏకాగ్రతతో ధ్యానిస్తూ చివరగా దివ్యమైన వ్యక్తిత్త్వంతో తన్ను తాను సర్వ వ్యాప్తమయిన బ్రహ్మంగా గుర్తిస్తుంది.

కీటకంగా ఉన్నప్పటి ఆకారాన్ని చూస్తే మనం దానిని భ్రమరంగా కాగలదని ఊహించలేము, అయినా అది భ్రమరమే. ఇదే విధంగా పరిమితులతో మరణించే సహజస్వభావంతో బాధామయ నికృష్ట జీవి అయిన వ్యక్తిత్వంలో దివ్యమయిన ఆత్మతత్త్వం మచ్చుకయినా కనిపించదు. కాని ఆత్మను గురించిన నిరంతర చింతనతో జీవుడు శరీర మనోబుద్ధులపై, వస్తువులపై, ఉద్రేకాలపై ఆలోచనలపై తనకుగల తాదాత్మ్యాన్ని విడిచి పెట్టినప్పుడు, అంతవరకూ నికృష్టంగా కనిపించిన జీవుడే అఖండ సత్ చిదానంద పరమ శాంత స్వరూపంగా తన్ను తాను తెలుసుకుంటాడు.

కీటకం కీటకంగా ఉండడం మానేస్తే భ్రమరంగా మారుతుంది. అదే విధంగా మానవుడు జీవునిగా తన్ను తాను భావించడం మానేస్తే పరమ శాంత స్వరూపుడుగా ప్రకాశిస్తాడు.

ఓం ! ఓం ! ఓం !

## లోకశాంతి ప్రార్థన

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా !
మాలోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామీ ! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడియుండి, మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు

ప్రాణము, ఆత్మలకు ఆత్మవై వెలుగొందు దేవా !
ప్రేమైక మూర్తీ ! నిన్ను తెలిసికొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే
మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ ! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల,
ఈ విశ్వము నందంతటను అందరును నీ దివ్య తేజస్సును
గ్రహింతురుగాక !
ఓ సచ్చిదానంద స్వరూపా ! ప్రతి మానవ
హృదయమునందును, నానా జాతి మధ్యమునను శాంతి
సామరస్యములను ప్రతిష్ఠింప చేయుము. ఓ దేవా !
ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన.
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## పూజనీయమైన ఓ దివ్య స్వరూపా !

భగవంతుడు పూజనీయమైనవాడు. ఎవరండి ఆ భగవంతుడు ?

భగవంతుడు అనేపదమునకు రెండు నిర్వచనములు స్మృతుల యందు కనబడతాయి.

**ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసశ్శ్రియః।**
**జ్ఞాన వైరాగ్య యోశ్చైవషణ్ణాం భగ ఇతి రణా ॥**

సమగ్రమైన ఐశ్వర్యము, వీర్యము, యశస్సు, శ్రియము, జ్ఞానము, వైరాగ్యము ఈ ఆరు సంపదలు పరిపూర్ణముగా కలవాడు భగవంతుడు.

**ఉత్పత్తించ వినాశంచ భూతానామా గతాంగతిమ్**
**వేత్తి విద్యా మవిద్యాచ సవాచ్యో భగవానితి ॥**

ఉత్పత్తి వినాశములు, శుక్లపక్ష కృష్ణపక్ష గతులు, విద్య అవిద్యలు వీటిని పరిపూర్ణముగా తెలుసుకొన్నవాడు భగవంతుడు.

సాధారణంగా మనము ఎవరయినా ఏదయినా సహాయము చేస్తే వారిని పూజిస్తాము. కాని భగవంతుడో మనము నిలవడానికి భూమిని, త్రాగేందుకు

నీటిని, వంటకొరకు అగ్నిని, ఊపిరి పీల్చేందుకు వాయువును, భవంతుల కొరకు ఆకాశాన్ని మనకిచ్చెను. ఎవరియినా, ఏదయినా ఇస్తే ప్రతిఫలాన్ని ఆశిస్తారు. కాని భగవంతుడు సకల సంపదలు మనకిచ్చినప్పటికిని ఆయన మనవద్ద నుండి ఏమి ఆశించలేదు. కనుక భగవంతుడు పూజనీయమైనవాడు.

**ఓ దివ్య స్వరూపా !**

బాహ్య స్వరూపాలన్నీ నశించిపోయేవి. ఒకానొకప్పుడు శ్రీరామానుజా చార్యులవారు శ్రీరంగని దర్శనార్థమై రంగని కోవెలకు వెళ్తున్నారు. ఇదే సమయంలో ఒక స్త్రీ వెంట ఒక వ్యక్తి ఛత్రము పట్టుకొని వెళ్తున్నాడు. ఈ దృశ్యము రామానుజాచార్యులవారి కంటపడింది. వారు ఆ వ్యక్తిని పిలిచి ఎందుకిలా ఛత్రము పట్టుకున్నారని ప్రశ్నించారు. ఆ స్త్రీ యొక్క సౌందర్యము సూర్యరశ్మికి నశించకుండా ఉండడానికి పట్టుకొన్నానని బదులు చెప్పెను. వెంటనే శ్రీరామానుజాచార్యులు ఇంతకన్నా అద్భుత సౌందర్యమును చూపెదను రమ్మొయని శ్రీరంగని దర్శనము చేయించెను. ఆ శ్రీరంగని దివ్య స్వరూపము ముందు తక్కిన స్వరూపములన్నియు క్షుద్రమైనవి, నశించేవి. ఎప్పుడయితే శ్రీరంగని దర్శనము చేసెనో, ఆ వ్యక్తి శ్రీరామానుజా చార్యులవారి ప్రియశిష్యునిగా మారిపోయెను.

శ్రీరామచంద్రులు మిథిలానగరమును చూడటానికి వెళ్ళినప్పుడు మిథిలా నగరవాసులు మేడలమీద నుండి రామచంద్రులవారి దివ్య మంగళ స్వరూపాన్ని చూచి విస్మయము పొంది ఆహా ! ఆ బ్రహ్మదేవుడు ఎంత దివ్య స్వరూపాన్ని సృష్టించెను. అని వారు వెళ్తున్నంత సమయమ శ్రీరామచంద్రుల వారి మీద దృష్టి నిలిపిరి. బాలురందరు వారి దివ్యమంగళస్వరూపము వెంట వెళ్తూ మిథిలా నగరమంతయు చూపించిరి. ఆహా అయోధ్య వాసులు ఎంత ధన్యజీవులని కొనియాడిరి. శ్రీరామచంద్రులు మన జనక మహారాజు నకు అల్లుడయితే మనము ఈయనను అప్పుడప్పుడు దర్శించవచ్చునని భావించిరి. (తులసీ రామాయణము)

దండకారణ్యములో మునులందరును శ్రీరామచంద్రుల దివ్యస్వరూపాన్ని చూసి మైమరచి మోహించిరి. అప్పుడు శ్రీరామచంద్రులు కృష్ణావతారములో మిమ్ములను అనుగ్రహించెదనని వాగ్దానము చేసెను. మునులే గోపికలుగా

అవతరించి శ్రీకృష్ణుని దివ్య స్వరూపమును రాసక్రీడల ద్వారా ఆస్వాదించి కృష్ణునితో ఐక్యత పొందిరి.

అర్జునుడు శ్రీకృష్ణుని అడుగుతాడు. "ప్రభూ, నావల్ల చూడడానికి శక్య మౌతుందని తలిస్తే, ఓ యోగేశ్వరా ! నాకు నీ అవ్యయమైన దివ్య స్వరూపాన్ని చూపించు."

అర్జునుడి వినయం. నమ్రత ఎంత ఎక్కువగా ఉన్నాయో, ఈ భావం ద్వారా తెలుస్తుంది. అతనికి అర్హత ఉన్నదనుకుంటే రూపాన్ని చూపమని అడుగుతున్నాడు.

**న తు మాం శక్యసేద్రష్టుం, అనేనైవ స్వచక్షుషా**

**దివ్యం దదామి తేచక్షుః పశ్య మే యోగ మైశ్వరమ్ ॥**(భ.గీ-11అ.8)

శ్రీకృష్ణభగవానులు అర్జునితో అంటారు. నీ కళ్ళతో నన్ను చూడలేవు. నీకు దివ్య దృష్టిని ఇస్తాను. నా యోగ సంపదను పరికించు.

తెరవెనుక కనబడే సినిమాకుగాని,రంగస్థలం మీద కనబడే నాటకానికి గాని, వాటిని నడపడానికి వెనుక ఎందరో వ్యక్తులు, శక్తులు పనిచేస్తూం టాయి. వాటిని అందరూ చూడలేరు. చాలమంది ఊహించలేరు కూడ. అలాగే ఈ జగన్నాటకానికి వెనుక అద్భుతమైన దివ్యశక్తులు ఉన్నాయి. అవి అన్నీ భగవంతుని ప్రకటరూపాలే. వాటిని చూపడానికి భగవంతుడు సిద్ధపడినా మామూలు కళ్ళు చూడలేవు. దివ్య దృష్టి అవసరం.

భౌతిక శాస్త్రాలలో కూడా శాస్త్రజ్ఞులు మామూలు కళ్ళతో సూక్ష్మమైన వాటిని చూడలేరు. మైక్రోస్కోపులో చూస్తారు. అణువులు, పరమాణువులు మైక్రోస్కోపులో కూడా కనబడవు. మేధాశక్తితో, ఊహవల్ల, తార్కిక జ్ఞానంతో తెలుసుకోవల్సిందే. అర్జునుడు ఆ దివ్యమంగళస్వరూపాన్ని దర్శించి విస్మయము పొందెను. సూర్యుని కాంతిలాగ అంతటా దీపిస్తున్న నిన్ను చూడ శక్యంకాదు. నీకు ముందు నుండి నమస్కారం, వెనుకనుండి నమస్కారం, అన్నీ అయిన నీకు అన్నివైపుల నుండి నమస్కారం. 'సర్వే నమస్యంతిచ సిద్ధ సంఘాః' సిద్ధ సంఘాలన్నీ నమస్కరిస్తున్నాయి.

అర్జునా ఈ దివ్యస్వరూపాన్ని నీవు తప్ప ఎవరూచూడలేరని భగవానుడు పలికెను. అంటే ! అర్జునుడు తప్ప వేరెవరు దివ్య స్వరూపాన్ని దర్శించలేరు.

కాబట్టి మనమందరము అలా ఊరుకోవలసినదేనా ? కాదు భగవానుడు తన దివ్య స్వరూపాన్ని దర్శించడానికి ఏ అర్హత ఉండాలో సూచిస్తున్నారు. ఎలా అయితే పి.జి.లో ప్రవేశించడానికి డిగ్రీ అవసరమో అదేవిధముగా భగవంతుని దివ్య స్వరూపాన్ని దర్శించడానికి అర్హత ఉండాలి. ఏ అర్హత ఉండాలో సూచిస్తున్నారు.

పరంతపా, అర్జునా ! అనన్యమైన భక్తి ద్వారా మాత్రమే నన్ను ఈ రూపంలో తెలుసుకోవడానికి, చూడడానికి, నా భావంలో ప్రవేశించడానికి సాధ్యపడుతుంది.

అర్జునా ! నా కోసం కర్మచేస్తూ నన్ను లక్ష్యంగా పెట్టుకొని, నా భక్తుడై సంగాన్ని త్యజించి ఎవరిపట్లా విరోధం లేనివాడు నా దివ్యస్వరూపాన్ని దర్శించ గలుగుతాడు. భగవంతుని గమ్యంగా పెట్టుకున్న వాళ్ళు అహంకారం నశించి దివ్యస్వరూపాన్ని దర్శించ గలుగుతారు.

**"సహస్రశీర్షా పురుషః సహస్రాక్షస్సహస్రపాత్"** అంటూ పురుష సూక్తము ఆ విరాట్ పురుషుని యొక్క స్వరూపమును వర్ణించుతూ ఆయనను అనంత మైన కన్నులు (సహస్రము అనగా అనంతము) కలవానిగా కీర్తించుతుంది.

అక్షము అంటే దృష్టి. అనంతమైన దృష్టి, చెదరనటువంటి దృష్టిని పరమ జ్ఞానులు, పరమభక్తులు మాత్రమే కలిగి ఉంటారు. శ్రీరామకృష్ణ పరమహంస వారు ఒకనాడు పల్లకీలో వేరే ప్రదేశానికి వెళ్తున్నారు. త్వరగా గమ్యం చేర్చేం దుకై బోయీలు దారి మార్చి ఒకవేశ్యా వాటికగుండా శ్రీపరమ హంస పల్లకీని తీసుకువెళతారు. పసిపిల్ల వానివలె పరమహంస అటూ ఇటూ చూస్తూ వుంటే ఆయనను విటునిగా భ్రమించి ఒకవేశ్య చాలా వికారమైన చేష్ట చేస్తుంది. ఆవిడ వంక చూచిన శ్రీపరమహంస, **"అమ్మా, నీవు ఇక్కడ ఉన్నావా "** అన్నారట. ఆ పరమహంస సర్వకాల సర్వావస్థల యందు కాళిమాత దర్శనం చేసుకోగలిగారు. అది భగవంతుని అనంత దృష్టి, అటువంటి స్థితిని పొందిన వారు తిరిగి రారని గీతా బోధ.

**"యద్గత్వా ననివర్తంతే, తద్ధామ పరమంమమ."** (భ.గీ. 15-6) పూజ్య రామకృష్ణానంద స్వామివారు, "కళ్ళను పుళ్ళు చేసుకోకండిరా" అంటూ ఉండేవారు. మాంసమయమైన దేహాలను చూచేవాడు (కామవికారం కలిగిన దృష్టి) అనంత మైన దృష్టిని పొందలేడు. పరమజ్ఞాని సర్వకాల సర్వావస్థల

యందు ఆత్మ దృష్టి కలిగి ఉంటాడు. అదే గీతలో చెప్పబడ్డ "సమదృష్టి" అటువంటి స్థితిని పొందినవారు ఈ మాంసలోకపు దృష్టికి తిరిగిరారు. సాధకులకు అటువంటి దృష్టి ఇంకా రాలేదంటే కన్ను చెదిరినప్పుడల్లా దివ్య స్వరూపాన్ని గుర్తు తెచ్చుకోవాలి. ఏ స్వరూపాన్ని దర్శించ గలిగితే ఇక దర్శించవలసినది ఉండదో అదే దివ్యస్వరూపము. పరమాత్మ దివ్య స్వరూపము కనుకనే ఆయన అందరికి పూజనీయమైనవాడు. దివ్య స్వరూపాన్ని దర్శించడానికి స్వామీజీ అనుగ్రహము పొందెదముగాక.

## మా లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటను నిండియున్న ఓ సర్వాంతర్యామి !

దివ్యస్వరూపాన్ని గూర్చి వివరించుకున్నాము. ఆ దివ్య స్వరూపమైన వాడు ఎక్కడ ఉంటాడు అనే విషయాన్ని స్వామీజీ వారు తెలియపరుస్తున్నారు.

**అన్తర్బహిశ్చ నారాయణః ఊర్ధ్వశ్చ నారాయణః**
**అధశ్చ నారాయణః నారాయణ ఏవేదగ్ం సర్వమ్ ॥** (నా.ఉప.మం2)

లోపలను, వెలుపలను, మీదను, క్రిందను సర్వత్రా నారాయణుడే నిండి యున్నాడు. 'సమోహం సర్వభూతేషు, నమే ద్వేష్యోస్తి నప్రియః' నేను అన్నింటిలో సమంగా ఉన్నాను.నాకు ద్వేషింప తగ్గవారు కాని, ప్రేమింప తగిన వారు కాని ప్రత్యేకంగా లేరు యని శ్రీకృష్ణ పరమాత్మ ఉపదేశించెను. భగవంతునకు ఇష్టాయిష్టములు లేవుకదా ! కంసుని శ్రీకృష్ణుడు హతమార్చెను. రాముడు రావణుని సంహరించెను. భగవంతుడు ఒక విధముగా వాగ్దానము చేసి ఇంకో విధంగా ఆచరిస్తాడా ? కాదు. మానవుడు ఆశకు లోనయినప్పుడు భగవంతుడే శిక్షిస్తాడు.

పూర్తిగా పాపములు చేసేవారిని పాపాత్ములు అన్నారు.

పూర్తిగా మంచిపనులే చేసేవారిని మహాత్ములు అన్నారు. కొన్ని మంచి పనులు చేస్తూ అప్పుడప్పుడు కొంచెం పాపంచేసేవారిని మనుష్యులు అన్నారు.

ఈ విషయాన్ని శ్రీ భగవానుడు కూడా చెప్పారు.

**సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి ।**
**ప్రకృతిం యాంతి భూతాని, నిగ్రహః కిం కరిష్యతి॥** (భ.గీ.3-33)

మనిషి పాపం చేయడానికి కారణం అతని అంతరంగంలో సూక్ష్మంగా దాగి ఉన్న ఆశ. ఆశ అనేది మనల్ని ఈ ప్రపంచంలో నానా తిప్పలు పెడు తుంది. మహాపండితుని కూడ పతనము చేస్తుంది. అలా పతనమైన వారు ఎవరు ? సీతమ్మ వారి రూపం మీద ఆశపడి రావణుడు పతనమయ్యెను. పాండవుల రాజ్యం మీద ఆశపడి దుర్యోధనుడు నికృష్టమైన మరణము పొందెను. తన ప్రాణంపైన ఆశపడి కంసుడు అనేక మంది నెలలు నిండని పసికందులను చంపి చివరకు తానే భగవానునిచేతిలో నాశనమయ్యెను. ఆశయనేది భంగపడిననాడు తీవ్ర మైన గాయం చేస్తుంది. అందుకే వేమన అంటారు.

**ఆశయనెడి త్రాళ్ళ నఖిల జంతువులెల్ల గట్టబడుచు గాన నిట్టలమున**
**జ్ఞానమనెడి ఛురియ బూని కోయగ రాదె విశ్వదాభిరామ వినురవేమ.**

ఆశ అనే త్రాటివల్ల జీవులందరమూ కట్టబడి ఉన్నాము. అందువల్ల స్థిరంగా ఉండి జ్ఞానమనే కత్తితో త్రాటిని కోయగరాదా ! అయితే ఈ ఆశను వేరే విధంగా మళ్ళించు కుంటే బంధము ఉండదు. రాములవారి దర్శనం కోసం బాల్యము నుండి వృద్ధాప్యము వచ్చువరకు భక్త శబరి ఆశతో ఎదురు చూసి రామునితో ఐక్యతచెందినది. ధ్రువుడు భగవంతుని చూడాలనే ఆశతో తపస్సుచేసి ధ్రువస్థానాన్ని పొందాడు. జగన్మాత పార్వతి అమ్మవారు శివుని భర్తగా పొందాలన్న ఆశతో ఆకులు కూడ తినకుండా తపస్సుచేసి అపర్ణయని పేరు తెచ్చుకున్నది. కుచేలుడు భగవానుని మీద ఆశతో తపస్సుచేసి సకల సంపదలను, భక్తిని పొందెను.

రావణుడు, దుర్యోధనుడు, కంసుడు ఒక ప్రక్క, శబరి, ధ్రువుడు, పార్వతి, కుచేలుడు ఒకప్రక్క ఉంచిచూస్తే వీరందరి వెనుక ఒకటే కనబడు తుంది. అదే ఆశ. మొదటి వారికి మృత్యువును అందజేస్తే తరువాత వారికి ముక్తిని ప్రసాదించినది. ఇందులో గ్రహించవలసినది ఏమంటే విషయ వస్తువులపట్ల ఆశ మానవుని పతనము చేస్తుంది. అదే ఆశ భగవంతుని యందు మళ్ళిస్తే ముక్తికి సోపానమవుతుంది.

నేను అన్నింటిలో సమంగా ఉన్నాను. నాకు ద్వేషింపతగ్గవారు కాని, ప్రేమింప తగిన వారు కాని ప్రత్యేకంగా లేరు అని వాగ్దానము చేసెను

కదా! పైన పాత్రధారులను పరిశీలిస్తే ఒకరికి మృత్యువు వేరొకరికి ముక్తి లభించింది. దీని ఆంతర్యము ఏమిటి? సకల చరాచర ప్రాణులలోను, జీవ చైతన్యానికి ఆధారమైన ఆత్మ మాత్రము ఒక్కటే. అన్నింటిలో సమంగా ఉన్నది ఆత్మయే అనుభావన వల్ల సమదృష్టి అలవడుతుంది. ఈ సమదృష్టి భిన్నత్వం నుండి ఏకత్వంవైపు మళ్ళిస్తుంది.

అయితే అన్నింటిలో సమంగా ఉన్నా తనను భక్తితో భజించిన వారిలో తానుంటానని, వారు తనలో ఉంటారనడం పైపైన చూస్తే పక్షపాతంఉన్నట్లు అనిపిస్తుంది. పడకగదిలో వాడుకునే బెడ్‌లైట్, హాలులో ఉండే ట్యూబులైటు, పెద్ద ఉత్సవాలప్పుడు వాడే ఫోకసింగ్ లైట్లు, సీరిస్ బల్బులు, ఆర్క్ లైట్లు ఇంకా మెర్కురి బల్బులు, సోడియం వేఫర్ లాంప్స్, చదువుకొనేటప్పుడు వాడే టేబుల్ లైటు ఇవన్నీ కాంతి నిచ్చేవే. ఇవన్నీ విద్యుచ్ఛక్తి ద్వారానే పని చేస్తాయి, కాని వాటి ద్వారా వెలువడే కాంతిలో భేదాలు ఉన్నాయి.

అన్నింటిలో సాధారణంగా (230 వోల్టేజీ) ఒకటే వోల్టేజీ కరెంటు ప్రవహిస్తుంటుంది. కాని ఆయా బల్బులు ఆకారాలు వాటిలో నింపబడే వాయువు, వాటిలో ఉండే ఫిలమెంటు యొక్క శక్తి (పవర్) నిబట్టి కాంతిలో తేడా ఉంటుంది. ఒకటే బల్బు హోల్డర్‌కు 20 (వాట్స్) బల్బు పెడితే చాలా మసకగా ఉంటుంది. అది తీసి 40 వాట్స్ బల్బు పెడితే కాంతి పెరుగుతుంది. దాన్ని తీసివేసి 200 వాట్స్ బల్బు పెడితే కాంతి బాగా ఉం టుంది. అంటే వోల్టేజీ ఒకటే అయినా ఫిలమెంట్ యొక్క శక్తినిబట్టి బల్బు ద్వారా ప్రవహించే కరెంటు మారుతుంది. అందువల్ల కాంతిలో తేడాలు కనిపిస్తాయి. అలాగే జీవులందరును వేరు వేరు మానసిక శక్తులు కలిగి ఉంటారు. వారిలో అంతఃకరణ శుద్ధి బట్టి ఆధ్యాత్మికశక్తి వారిలో నుండి బయటకు వ్యక్తమవుతుంది. విద్యుచ్ఛక్తి జీరో బల్బుయందు, 200 వాట్స్ బల్బు నందు ఒకేవిధంగా ఉంది. రావణుడు, వీరందరు జీరో బల్బులాంటి వాళ్ళు, శబరి, వీరందరు 200 వాట్స్ బల్బు వంటివారు. భగవంతునకు ఏ పక్షపాతమును లేదు.

భగవంతుడు సర్వాంతర్యామిగా ఉన్నాడు. కాబట్టి మన గుణ దోషాలు ఆయన మీద ఆరోపణ చెయ్యవచ్చు. అందుకని భగవానుడు;

**మత్‌స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః** (భ.గీ. 9-4)

సర్వభూతములు నాలో ఉన్నాయి. కాని నేను వాటిలో లేను అంటారు.

ఆయన అంతటా ఆవరించి ఉన్నందునే మనకి ప్రపంచం గోచర మవుతుంది. ప్రతి ప్రాణి ఆయన వలననే జనిస్తుంది. అయితే ప్రాణుల వ్యవహారాలతో, సుఖదుఃఖాలతో, సంస్కారాలతో ఆయనకు సంబంధంలేదు. జీవుల పరిమితులలో పరమాత్మలేడు.

బంగారంతో చేయబడిన నగలన్నింటికి ఆధారము బంగారమే. అంటే నగలన్నీ బంగారంలో ఇమిడి ఉన్నాయన్న మాట. వాటియొక్క ఆకారము, పేరులో భేదాలు ఉన్నప్పటికీ అన్నింటిలో బంగారము అనే మూల పదార్థంలో ఎలాంటి మార్పులుండవు. నామము, రూపము యొక్క ప్రభావం బంగారము యొక్క విలువపైగాని, ఘనసాంద్రత (Specific gravity) పై గాని ఉండదు. అంటే నగలకుండే నామరూపాల యొక్క పరిమితులు (Limitations) బంగారానికి అంటవన్న మాట ! అలాగే అన్ని ప్రాణులకు ఆధారంగా చైతన్య స్వరూపుడైన భగవంతుడున్నాడు, సచ్చిదానందస్వరూపుడైన ఆయనలోనే సమస్త ప్రాణులున్నప్పటికీ, నగల యొక్క పరిమితులతో బంగారానికి సంబంధంలేనట్లుగా ప్రాణుల యొక్క జనన మరణాలు, సుఖదుఃఖాలు, పాపపుణ్యాలు మొదలైన పరిమితులు భగవంతునకు అంటవు. కాబట్టి, ప్రాణులన్నీ నాలో ఉన్నా 'నేను వాటిలో లేను' అన్నాడు. అంటే ప్రాణులయొక్క పరిమితులతో సంబంధంలేదు కాబట్టి ఆయన అనంత తత్త్వానికి భంగము లేదు.

గీతలో 'బహిరంతశ్చ భూతానాం' అని చెప్పబడింది. సర్వ వ్యాప్తమైన పరమాత్మ జీవులలోను, బయట, లోపల, సర్వత్రా ఉంటాడు. 'సూత్రేమణిగణా ఇవ' ఈ ప్రపంచం యావత్తు దారంలో మణులవలే ఆయనలో గ్రుచ్చబడి వుంది.

పూర్వం ఒకప్పుడు ఒక మహాత్ముడు మక్కాకు యాత్రగా వెళ్ళడం గురించి ఒక కథ వుంది. అతడు మక్కాకు చేరుకునే సరికి ఎంతగానో అలసి పోయి నిద్రపోతాడు. కొంతసేపట్లో అక్కడ ఉన్న పూజారి అతనిని కుదుపుతూ మేలుకొల్పుతుండగా ఆ మహాత్మునకు మెలకువ వచ్చింది. ఓ కాఫిర్ ! పవిత్రమైన కాబా వైపుగా కాళ్ళు జాపి నిద్రపోకూడదని నీకు

తెలియదా? లేచి సరిగ్గా పడుకో అని పూజారి గదమాయిస్తాడు. ఇంత చిన్న విషయానికి కోపమెందుకు తమ్ముడూ ? భగవంతుడెక్కడ లేడనుకుం టావో అటువైపుగా నాకాళ్ళను తిప్పితే సరిపోతుంది కదా ! అని ఆ మహాత్ముడు జవాబిచ్చెను.

పూజారి అసహనంగా మహాత్ముని కాళ్ళుపట్టుకుని మరోవైపులాగి పడుకో బెడతాడు. చిత్రంగా కాబా కూడా అటువైపే తిరుగుతుంది. పూజారి మరొక దిక్కుగా కాళ్ళను లాగుతాడు. మళ్ళీ అటువైపే దైవపీఠము తిరుగు తుంది. అన్ని దిక్కులలోనూ భగవంతుడే నిండి ఉన్నాడు. మక్కాలేని ప్రదేశమే లేదు. అప్పుడు పూజారి ఆ మహాత్ముని క్షమించమని ప్రార్థిస్తాడు.

**"ఆశ్నోతి వ్యాప్నోతీతి ఆశుః"** ఆజ్ఞ పూర్వకమైన 'ఆశూవ్యాప్తౌ' అన్న ధాతువు కంటే ఔణమైన ఉప్రతయ్యము చేరిస్తే ఆశుః అను రూపము వస్తుంది. అనగా సర్వవ్యాపకత్వము కాబట్టి నమ ఆశవే యని శతరుద్రీయము చెప్పబడుతుంది. అందుకే స్వామీజీ వారు శునకములో కూడా భగవంతుని చూసి దానికి కూడా సమాధి కట్టించారు. మహాత్ములకు సర్వత్రా భగవంతుడే గోచరిస్తాడు. అటువంటి భావన స్వామీజీ వారు ప్రసాదించుగాక !

## మాలోపల ప్రత్యణువు నందును ఇమిడి ఉండి

ఒక భౌతిక శాస్త్రవేత్త దృష్టిలో శరీరము కొన్ని ఎలక్ట్రానులతో నిర్మిత మైనది. వైశేషిక తత్త్వవేత్త దృష్టి ప్రకారము శరీరము పరమాణువు. ద్వ్యణుక, త్ర్యణుకములతో నిర్మితమైనది. అందుకే శతరుద్రీయములో 'నమః పాగ్ం సవ్యాయచ'. అని చెప్పబడింది. అంటే పరమాణువు ప్రమాణములో భగవంతు నకు నమస్కారము. అందుకే స్వామీజీ వారు మా లోపల ప్రత్యణువు నందు ఇమిడి ఉంది అని అన్నారు. మనలో ప్రత్యణువు నందు భగవంతుడు ఇమిడి ఉన్నాడు. తోలుబొమ్మల వెనకాల సూత్రధారి ఏవిధముగా బొమ్మలను రంగ స్థలము మీద ఆడిస్తే ఆడుతున్నవో, అదే విధముగా ఈ జగత్తు అనే రంగస్థలం మీద ప్రతి జీవుని ప్రత్యణువులో భగవంతుడు ఉండి ఆడిస్తున్నాడు. ఆయన చైతన్యం లేకపోతే జీవుడు శవం, ఆయన చైతన్యం ఉన్నంత సేపు ఈ జీవుడు శివం. శివం ఎప్పుడయితే వెళ్ళిపోతుందో, ఈ శవానికి ఏ మాత్రము విలువలేదు. ఎంతటి మహారాజు శరీరమయినా అంతే. చెప్పులుకున్న విలువ

కూడా శవానికి లేదు. శివం ఉన్నంతవరకే వ్యక్తిని గౌరవిస్తాము. ప్రతి వ్యక్తిలో అణురూపమున భగవంతుడు ఉన్నాడని నారాయణ సూక్తము చెప్తుంది.

**నీలతో యద మధ్యస్థాద్ విద్యుల్లే ఖేవ భాస్వరా**
**నీవార శూక వర్తన్వీ పీతా భాస్వత్యణూపమా** (మంత్రపుష్పం-12)

నీల వర్ణముగల మేఘమధ్యమునందు మెరుపుతీగవలె ప్రకాశించుచుండు ఈయగ్నిశిఖ రవ్వధాన్యపు ముల్లువలె సూక్ష్మమై పసిమి వర్ణముగలదై అణువును బోలి ప్రకాశించుచున్నది. సర్వశక్తియుతుడైన భగవంతుడు దుర్భేద్య అణుమాత్రుడై యున్నాడని శంకింపరాదు. ఏలయన సర్వోపగతమైన అతి సన్నిహితమైన అతడే ప్రజాపతి బ్రహ్మ, అతడే పార్వతిపతి, అతడే లక్ష్మీపతి, అతడే దేవేంద్రుడు, అతడే మాయావిశిష్ట జగత్కారణమగు పరబ్రహ్మ, శుద్ధచిద్రూపుడగు సర్వేశ్వరుడు. ప్రతి వ్యక్తిలో నారాయణుడే ఉన్నాడు కాబట్టి ఎవరిని అవమానించిన, హింసించిన నారాయణుని హింసించినట్లు అవుతుంది.

నరసీమెహతా అనే ప్రసిద్ధిగన్న మహాభక్తుడు ఉండేవాడు. అతని కుమార్తె వివాహము జరిగినది. కుమార్తె అత్తవారింట అడుగిడినది. అత్తింటివారు కానుకలు ఏమి తీసుకురాలేదని హింసిస్తూ ఉండేవారు. నీ తండ్రి దగ్గర చిఱుతలు తప్ప ఏమి ఉన్నాయిలే ఇవ్వడానికి యని పరిహాసము చేసేవారు. కుమార్తె నరసీ మెహత దగ్గరకు వచ్చి తన కష్టమును చెప్పుకుని విలపించెను. ద్వారకానాథుడు ఉండగా మనకేమి కొరత వారికి ఏయే కానుకలు కావలెనో అడిగి జాబితా రాయించుకొని రమ్మని కుమార్తెను పంపెను. అత్తగారు, తక్కిన ఇంట్లో వాళ్ళందరూ చక్కని అమూల్యమైన కానుకలను గురించి గుమాస్తా ద్వారా వ్రాయించిరి. గుమస్తాను కూడ తనకు ఏమి కావలెనో వ్రాయమనిరి. నరసీ మోహతాకు ఏమున్నది? అతను ఏమి ఇవ్వగలడు? అను అవహేళన భావముతో గుండురాయి అని వ్రాసెను. ఈ జాబితా ద్వారకాధీశునకు ఇవ్వబడెను. ద్వారకాధీశుడు జాబితాలో రాసిన కానుకలకు రెట్టింపుగా తానే స్వయముగా తీసుకు వెళ్ళి ఇచ్చెను. గుమస్తా రాసిన గుండురాయి కూడ కానుకలలో ఉంది కాబట్టి రెండు గుండు రాళ్ళు గుమస్తా తలమీద కొట్టడము ప్రారంభించినవి. ఆ బాధతట్టుకోలేక ద్వారకాధీశుని

క్షమాభిక్షకోరెను. ద్వారకాధీశుడు నరసీమెహతా దగ్గరకు వెళ్ళి క్షమాపణ కోరమనెను. భగవంతుడు ప్రత్యణువు రూపములో జీవులలో ఉన్నాడు కాబట్టి ఎవరిని హింసించిన భగవంతుని హింసించినట్లే.

## మా నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము

**కేనోపనిషత్తులో** శిష్యుడు గురువుగారి దగ్గరికి వెళ్ళి ప్రశ్నిస్తాడు. ఏమిటి ఆ ప్రశ్న ? శిష్యుని ప్రశ్న.

**ఓమ్ కేనేషితం పతతి ప్రేషితం మనః**
**కేనః ప్రాణః ప్రథమః ప్రైతి యుక్తః**
**కేనేషితాం వాచ మిమాం వదన్తి**
**చక్షుః శ్రోత్రం క ఉ దేవో యునక్తి** (1ఖం.మం.1)

**ఎవరిచేత మనస్సు విషయవస్తువులపైన పడుతుంది ?**
**ఎవరిచేత ఈ జడ శరీరంలోకి ప్రాణం వస్తుంది ?**
**ఏ దేవుడు కంటిని, చెవిని జోడించుతాడు ?**

ఈ ప్రశ్న చాలా నిగూఢమైనది, ప్రపంచంలో ఇలా ఎందుకు ఉంది ? అలా ఉండకూడదూ? అనేప్రశ్న ఉన్నంత కాలం మన దృష్టి బాహ్యంగా ఉన్నట్లే. ప్రపంచం నాకు ఎందుకు ఇలా కనిపిస్తుంది? అన్న ప్రశ్న ఉదయించి నప్పుడు దృష్టి అంతర్ముఖము అయినట్లు.

అందరి మనస్సు ఒకేరకంగా ఉండదు. అంతేకాదు ఇప్పుడు ఒకరకంగా ఉన్న మనస్సు కొంతసమయానికి చాలా రకరకాలుగా మార్పు చెందుతుంది. దీనికికారణం ఎవరు ? ఈ జడ శరీరానికి చైతన్యం వచ్చికదులుతోంది. ప్రాణం ఇందులోకి ఎలా వచ్చింది . ఎవరు ప్రవేశపెట్టారు? కంటికి ఆకారా లకి లంకే. చెవికి శబ్దాలకు లంకే.అంతేకాదు, కన్ను ఒక ఆకారంచూస్తే వెంటనే దాని నామం మనకు స్ఫురిస్తుంది. చెవి ఒకమాట వింటే దాని ఆకారం మనస్సుకు స్ఫురించుతుంది. ఈ లంకె ఏ దేవుడు పెట్టాడు?

ఒక డాక్టరు దగ్గరకు వెళ్ళి కన్ను ఎలా చూస్తుంది అని ప్రశ్నిస్తే, కంటి బొమ్మవేసి రెటీనా ఫ్యూవల్, ఆప్టిక్‌నెర్వ్ ఇలా సైన్స్ అంతా చెప్పి ఈ విధంగా

కన్ను చూస్తుంది అని చెప్తారు. అదే ఒక నాస్తికుని దగ్గరకు వెళితే సహజంగా జరిగిపోతాయి అనే సమాధానము వస్తుంది.

అదే ఒక హిమాలయ ఋషి దగ్గరకు వెళ్ళిపై ప్రశ్నలను అడిగినప్పుడు దాని సమాధానం వేరే విధంగా ఉంటుంది. ఋషి చెప్పిన సమాధానమే శ్రీస్వామీజీ వారు అందించారు.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనోయత్ వాచోహ వాచగ్ం స ఉ ప్రాణస్య ప్రాణః**
**చక్షుషః చక్షుః, అతిముచ్య ధీరాః ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవన్తి॥** 1ఖం.మం2

చెవికి చెవి, మనస్సులకు మనస్సు, ప్రాణములకు ప్రాణము, కంటికి కన్ను. ధీరులు దీనిని పరిత్యాగము చేసి ఈ లోకము నుండి వెళ్ళి అమరులవు తారు.

## నేత్రములకు నేత్రము (కన్నులకు కన్ను)

కన్ను ఆకారం తెలుసు మనకు కాని కంటిని చూచేవాడు తెలీదు. కన్ను చూడటం లేదు. టెలిస్కోపు ద్వారా సూక్ష్మ విషయాలను చూస్తున్నాము. టెలిస్కోపు సూక్ష్మ పదార్థాలను చూడటంలేదు. టెలిస్కోపు ద్వారా చూసేవాడు ఉన్నాడు. కిటికీ ద్వారా చూస్తున్నాము. దారిలో వెళ్లిన వారు మనము చూడడము గమనించారు. కిటికీ చూస్తుంది అంటారా ? కిటికిలో నుండి ఎవరో చూస్తున్నారు అంటారు. కిటికీ ఎవరిని చూడదు. కన్ను ఒక కిటికీ. దాని నుండి చూచే వాడు ఒకడు ఉన్నాడు.

**యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూగ్ంషి పశ్యతి**
**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే** 1ఖం.మం.6

తాత్పర్యం : ఏది కంటితో చూడబడదో, దేనివల్ల కంటి వ్యాపారాలన్ని గ్రహించుతారో అదే బ్రహ్మమని తెలుసుకో 'ఇది' ఎదురుగా ఉపాసించేది బ్రహ్మము కాదు.

కంటితో చూచేది కంటి కన్నా అల్పమైనది. కంటిలో శక్తివంతమైన కాంతిని కేంద్రీకృతం చేస్తే చూడలేదు. నీలలోహిత కిరణాలను చూడలేదు. మధ్యలో వెలుగుచూస్తుంది. దేని కారణంగా రాముని, కృష్ణుని రూపాలు కన్ను చూడగలుగు తుందో అది బ్రహ్మము. ఇది కాదు.

## కర్ణములకు కర్ణము (చెవులకు చెవి)

చెవి ఆకారం మనకు తెలుసు. చెవి వెనుకాల వినేవాడు తెలీదు. టెలిఫోను ద్వారా మాట్లాడినప్పుడు టెలిఫోను వినటం లేదు. టెలిఫోను ద్వారా వినేవాడు వున్నాడు. చెవి ఒక కిటికి, వినేవాడు ఉన్నాడు.

**యచ్ఛ్రోత్రేణ న శృణోతి, యేనశ్రోత్ర మిదగ్ం శ్రుతమ్ ।**

**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం మిదగ్ం యదిద ముపాసతే ॥** 1ఖం.మం.7

తాత్పర్యం : దేనిని చెవి ద్వారా వినడో, దేనివల్ల చెవి వినే దాన్ని తెలుసుకుంటుందో, అదే బ్రహ్మమని తెలుసుకో. 'ఇది' అని ఉపాసన చేసేది బ్రహ్మము గాదు. చెవి చేత వినబడేది చెవి కన్న అల్పమైనది. బ్రహ్మము చెవికి విషయం కాదు. చెవి వినే విషయాలు మెదడులో సంచలనం కలిగించగా, ఆ సంచ లాన్ని గ్రహించేది బ్రహ్మము. భగవంతుని కీర్తనలు వినబడేవి ఉపాసనలో భాగం మాత్రమే, బ్రహ్మము కాదు.

## హృదయములకు హృదయము

హృదయమనునది రెండు రూపములుగా ఉన్నది. అందు వక్షస్సునందు పరిచ్ఛిన్నమై యున్న హృదయము. ఈ హృదయమునకు వెనుక సంవిత్ (జ్ఞాన) రూపమున నిరుక్తము కాబడి నట్టిదేదియో అద్దానిని ఆ హృదయము గ్రహింపదగినది. ఇట్టి 'సంవిద్ధృదయకోశము' నందు వాసనారహితమైన తేజస్సు ఉన్నదని వసిష్టమహర్షి శ్రీరామచంద్రునకు ఉపదేశించెను. హృదయ శబ్ద నిర్వచనము 'సవాఏష ఆత్మా హృదితస్యైత వేవనిరుక్తగ్‌హృదయమితి.' (హృది+అయం+వర్తతే) హృదయము నందు ఉన్నాడు. హృదయము వెనుక హృదయము (సంవిత్) ఆత్మనామమై యున్నది.

అందుకే గీతలో భగవానులు చెప్తారు. **'సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాంతి మృచ్ఛతి.'** సమస్త చరా చరములందు సుహృదయుడనై ఉంటాను. అందరి హృదయాలలో ఉండి నడిపించేవాడు ఆయన. **'ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేఽ ర్జునతిష్టతి.'** సర్వభూతముల హృదయ స్థానముల యందు వ్యవస్థితుడై ఉన్నాడు.

## మనస్సులకు మనస్సు

మనస్సు ఆలోచించడం లేదు. మనస్సు వెనుకాల ఆలోచించే వాడు ఉన్నాడు.

**య న్మనసా న మనుతే యేనాహుర్మనో మతం ।**
**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే ॥** –1ఖం.మం.5

తాత్పర్యం : ఏది మనస్సుచేత భావింపబడదో, దేనివల్ల మనస్సు భావించుతుందో అది బ్రహ్మమని తెలుసుకో 'ఇది' కాదు. ఇక్కడ ఉపాసించేది కాదు.మనస్సుకు ఆకారం లేదు. వ్యవహారం ఒక్కటే. వ్యవహారం బట్టి మనస్సు ఉన్నది అని తెలుసుకుంటున్నాము. నేను ధ్యానం చేస్తున్నానండి. దేనికారణంగా మనస్సు ధ్యానం చేస్తుందో స్మరణచేస్తుందో అది బ్రహ్మం. మనస్సు అనంతమైన వాటిని ఆలోచిస్తుంది. అనంతమైన దానిని ఎలా ఆలోచిస్తుంది. రాముడు అయోధ్యలో ఉన్నాడు అని భిన్నంగా చూస్తున్నాము. దేనికారణంగా రాముడు అయోధ్యలో ఉన్నాడని మనస్సు ఆలోచిస్తుందో అది బ్రహ్మము.

**శ్వాసలకు శ్వాస**

శ్వాస వెనుక ఆధారమైన వాడు ఉన్నాడు.

**ప్రాణములకు ప్రాణము (ప్రాణస్య ప్రాణః)**

ప్రాణము వెనుకాల జీవించే వాడు ఉన్నాడు. మనసును ప్రేరేపించేందుకు ఒకరు, ప్రాణం పోసేందుకు మరొకరు, కంటి వెనుక ఒకరు, చెవి వెనుక ఒకరు, వాడుకునే జీవుడు అంటూ ఇన్నిరకాలు లేవు. ఇక్కడ కనిపించే సర్వానికి పరమాత్మ ఒక్కడే కారణం. కన్ను వెనుకాల చూచేవాడు, చెవి వెను కాల వినేవాడు, మనస్సు వెనుకాల ఆలోచించేవాడు, నీ జీవం వెనుకాల అసలు జీవించేవాడు. ప్రాణంతో జీవించేవాడు అన్నీ ఆయనే. నీకు జీమనేది లేదు. ప్రకృతి శక్తులు వాడుకొని మనము ఉపయోగించుకుంటున్నాము. ఆలోపల ఎన్నో శక్తులు ఉన్నాయి. అవి వ్యక్తిత్వాన్ని నడిపిస్తున్నాయని అనుకోవద్దు. ఉన్నది ఒక్కటే. ఒక్కటే సేవ చేస్తుంది. నీవు వాడుకుంటున్నావు అని అనుకుంటావు. ఆ వాడుకునే వాడు ఆయనే, నీవు ఒకపరికరము. కన్ను ద్వారా చూచేవాడు, చెవి ద్వారా వినేవాడు, అన్నీ ఆయనే. అయితే మరి నేను ఎవరు? నీవు లేనే లేవు! ఉన్నది ఆయనే, ఒక్కడే సూత్రధారి నడుపుతున్నాడు. నేను అనుకోవడము భ్రమ. ఆలోకించేది లోకం. ఈ లోకాన్ని వదల లేక మృత్యువు పాలయ్యేవాడు జీవుడు. అవివేకి జీవుడు. విడిచినవాడు అతడే దేవుడు. లోకాన్ని, శరీరాన్ని, ఇంద్రియాల మీద తాదాత్మ్య భావాన్ని విడిచిపెడితే అమృతతత్త్వాన్ని పొందుతారు. అయితే విడిచిపెట్టడానికి

వివేకము ఉండాలి. ధైర్యము వుండాలి. నేను అడిగేది ఒక ప్రశ్న అయితే, సూటిగా పరమాత్మచేత అని చెప్పవచ్చు కదా! అలా కాకుండా కన్నుకు కన్ను, కర్ణములకు కర్ణము అని చెప్పడమేమిటి? మన కన్నుని మనం చూసుకోలేము ? లోకంలో అన్ని విషయాలు తెలుసు కున్నట్లు పరమాత్మని తెలుసుకోవడానికి వీలుపడదు.

**న తత్ర చక్షుర్గచ్ఛతి, న వాగ్గచ్ఛతి నోమనో న విద్మో న విజానీమో ।**
**యథైత దను శిష్యాత్, అన్య దేవ తద్విదితాన్ అథో అవిదితాదధి**
**ఇతి శుశ్రుమ పూర్వేషాం యే న స్తద్ వ్యాచ చక్షిరే ॥** 1ఖం.మం.3

తాత్పర్యం : అక్కడకు కన్ను వెళ్లదు. వాక్కు వెళ్లదు. మనస్సు చేరదు. మేము ఎరుగము. శిష్యులకు ఎలా బోధించాలో మాకు తెలియదు. అది తెలిసినదాని కన్నా భిన్నమైనది. తెలియనిదాని కన్నా అధికమైనది. మాకు దానిని బోధించిన పూర్వీకుల వల్ల విన్నాము. గురువుగారి సమాధానం చూస్తే అయోమయంగా వుంటుంది. సూటిగా చెప్పవచ్చు కదా ! సూటిగా ఆత్మతత్త్వాన్ని చెప్పడానికి సాధ్యపడదు.

విషయవస్తువులను తెలుసుకోవడానికి మనం రకరకాలుగా ప్రయత్నిస్తాము, కంటితో చూడడం మొదటి పద్ధతి. తెలిసినవారు వర్ణించితే విని తెలుసుకోవడం రెండో పద్ధతి. ఇదివరలో మనము అనుభవించినవాటిని మనస్సుతో జ్ఞాపకం చేసుకోగలము. సూక్ష్మాతి సూక్ష్మమైన శాస్త్రవిషయాలను బుద్ధిలోని సునిశితమైన జ్ఞానంతో తెలుసుకుంటాము. ఈ పద్ధతులు ఆత్మను తెలుసుకోవడానికి పనికిరావు; మనకు లౌకిక విషయాలు తెలుసుకోవడానికే ఉపయోగపడతాయి ఆత్మయో కంటికి, శ్రోత్రమునకు, మనస్సుకు, వాక్కుకు, బుద్ధికి వెనకాల ఉన్నటువంటిది. ఇవన్ని ముందుకే నడుస్తాయి కాని వెనక్కి తిరగలేవు, అందువల్ల వీటి ద్వారా తెలుసుకోలేము. విద్యా బోధన చేయడానికి అవలంభించే పద్ధతులు కూడా ఆత్మను గురించి తెలియ చెప్పడానికి ఉపయోగించవు. స్థూలమైనవాటిని కొలతలతో చూపించి బోధిస్తారు. సూక్ష్మమైన మనోభావాలను కవిత్వం ద్వారా వర్ణిస్తారు. క్లిష్టమైన విజ్ఞాన శాస్త్రాలని 'సూత్రముల' ద్వారా వివరించుతారు. ఆత్మను గూర్చి ఈ పద్ధతులలో చెప్పలేము (అందుకని గురువు మేము ఎరుగము అన్నారు.)

ఎందుకంటే అది తెలిసిన విషయము కాదు, తెలియనిది కాదు. తెలియడం, తెలియకపోవడం అనేవి బుద్ధి పరిధిలోనివి. ప్రాపంచిక విషయాలను గూర్చిన సమాచారం బుద్ధిలో ఉంటే 'తెలుసును' అని, అలా సమాచారం లేకపోతే 'తెలియదు' అని మనం అంటాము. బుద్ధికి ఏది తెలుసునో, ఏది తెలియదో వెతికి చెప్పేది ఆత్మ. తెలిసిన వాటికి, తెలిసినదానికి, తెలియని వానికి భిన్నమైనది అంటే ఏమిటి? నాకు తెలిసిన విషయాలన్నీ ఒక కాగితములో జాబితా రాసాను. తెలియని విషయాలన్నీ ఒక కాగితములో జాబితా రాసాను. అయితే నేను ఏ జాబితాలో ఉన్నాను? నేనా ! నేను. **'విదితాత్ అవిదితాత్ అన్యత్.'** నేను తెలిసిన దానిని కాదు, తెలియని దానిని కాదు. రెండింటికి భిన్నమైన దానిని. బుద్ధిలో సమాచారం ఉంటే 'తెలుసును' అంటున్నాము బుద్ధిలోసమాచారం లేకపోతే 'తెలియదు' అంటున్నాము, ఎవరు బుద్ధిలో ప్రవేశించి తెలియదని చెప్తున్నారు ? తెలుసును, తెలియదు అని ఎవరు చెప్తున్నారో, రెండింటికి భిన్నమైన దానిని తెలుసుకో బడవలసినది. ఇట్లాగా మా పెద్దలు చెప్పారు. రెండింటికి అతీతమైనదని చెప్పారు కాబట్టి మేము ఆ విధముగా తెలుసుకున్నాము. ఇది బుద్ధితో తెలుసుకోవలసినది కాదు.

ఉత్తమ అధికారి శిష్యునకు చేసిన ఉపదేశము :

**య ద్వాచా నభ్యుదితం, యే న వాగభ్యుద్యతే ।**

**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే ॥** -1ఖం.మం.4

ఏది వాక్కువల్ల వెల్లడింపబడదో, వాక్కు దేనివల్ల అన్నీ వెల్లడించదో, అదే బ్రహ్మము అని తెలుసుకో. 'ఇది' అని ఎదురుగా చూచి ఉపాసించేది బ్రహ్మము కాదు. వాక్కుకు వెనకాలనుండి వాక్కును వెల్లడించే శక్తినిచ్చేది బ్రహ్మము. ఎదురుగా ఉండేది ఉపాసనకు అనువైనది బ్రహ్మము కాదు.

మనము ప్రతీది వాక్కుచేత వెల్లడిస్తున్నాము. మనస్సులో భావాలు వెల్లడిస్తున్నాము. బుద్ధిలో ఆలోచనలు వర్ణిస్తున్నాము. వాక్కు వెల్లడించడానికి వాక్‌శక్తికావాలి. దవడలు, నాలుక, పెదవులు, దంతములు కావాలి స్వరపేటిక ఉండాలి. ఇదంతా ఒక ఏర్పాటు. ఇదంతా ఎవరు అమర్చారు? ఆయన మాట్లాడదలచుకున్నాడు కాబట్టి ఇదంతా తయారు చేశాడు. ఆయన ఎక్కడ ఉన్నాడు? వాక్కుని వాడుకునేవాడు బ్రహ్మము. ఎదురుగా రాముడు కృష్ణుడు

అని ఉపాసన చేస్తున్నాము అదికాదు. అనంతపరమాత్మ చేరుకోవడానికి రాముడు, కృష్ణుడు మూర్తులను పెట్టుకుంటాము, దేని కార ణంగా రామ, కృష్ణ యని వాక్కు అంటుందో అది బ్రహ్మము.

**యత్ ప్రాణేన న ప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే**
**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే** 1ఖం.మం.8

ఏది ప్రాణం చేత జీవించదో, దేనివల్ల ప్రాణం కదులుతుందో, అదే బ్రహ్మము. 'ఇది' అని ఉపాసించేది బ్రహ్మము కాదు.

బ్రహ్మమునకు ప్రాణం అక్కరలేదు. ప్రాణం అందులోనుంచి పుడు తుంది. జీవరాసులేవి ప్రాణం ఉంటేగాని బ్రతుకలేవు. ప్రాణంతో కదలాడే సాకారదేవుడు ఉపాసనలో భాగం మాత్రమే. 'ఇది' ఉపాసించేది బ్రహ్మము కాదు. దేనికారణంగా ఈ ప్రపంచం అంతా కదులుతుందో అదే బ్రహ్మము. కొంతమంది ఇటువంటి ఉపదేశమును ఆధారముగా తీసుకొని ఉపాసనలు చేయడం మానివేస్తారు. ఉపాసన మాని వేయవలసిన దశ ఇప్పుడుకాదు.

రామకృష్ణ పరమహంసలాగ ఉపాసనచేసి కాళీమాత దర్శనము పొంది ఆమెతో మాట్లాడి చివరి దశలో శ్రీ తోతాపురి అనే గురువు ద్వారా సాకారము నుండి నిరాకారములో లీనమయ్యెను. సాకారనామ జపంలో మనో మాలి న్యాల్ని తొలగించి తదేక ధ్యానంలో దేవతా దర్శనాన్ని పొంది దేని కారణంగా చూడగలుగుతున్నావో, అది శుద్ధ చైతన్యం.

అందుకే వేమన పూజా ప్రయోజనాన్ని చెప్పారు!

**దేవ పూజసేయ దివ్య భోగము గల్గు-తత్త్వ మెరిగెనేని దైవసముడు**
**యేమి లేని నరుని కే గతి లేదురా-విశ్వదాభిరామ వినురవేమ.**

తాత్పర్యం : దేవతలను పూజిస్తే దివ్యమైన భోగాలు కల్గుతాయి. తత్త్వం తెలుసుకుంటే తాను దైవంతో సమానమవుతాడు. అది ఇదిలేని నరుడికి ఏ గతి లేదు. పూజవలన అద్వైత సిద్ధి కలుగుతుంది.

**పూజసేయ సేయ పూజారి తానౌను-పూజ వస్తు వెన్న భువిని తాను**
**ఏడ పూజ సేయ నెల్ల దిక్కుల తానే-తానునేనే, నేనే తాను వేమ.**

తాత్పర్యం : పూజలు చేయగా తానే పూజారి, పూజా ద్రవ్యాలు, పూజా స్థానం, భగవంతుడు సర్వము తానే అవుతాడు. తానే భగవంతుడనని, భగ వంతుడు తనకన్నా భిన్నంకాదని తెలుసుకుంటాడు. ద్వైత భావనతో ప్రీతితో,

దీక్షతో పూజలు చేసినప్పుడు క్రమంగా భక్తి గాఢమై పరాభక్తిగా మారి తానే భగవంతుడనని తెలుసుకుంటాడు.

ప్రారంభదశలోనే ఉపాసన మానివేస్తే వేమన సూచించే గతియే ప్రాప్త మవుతుంది. సాకారంలో భక్తితో ఉపాసనలు పూర్తి అయ్యాక చివరి ఉపదేశం ఇది. మనము జీవించడం ఆయన కారణంగా, వ్యక్తిలో ఇంద్రియాలను, మనస్సును ప్రేరేపించినది ఎవరనే ప్రశ్నకు సమాధానంగా ఇంద్రియాలను, మనస్సును వాడుకునే వాడు వాటి వ్యాపారాలను తెలుసుకునేవాడు సర్వము బ్రహ్మమేనని గురువుగారు సమాధానం ఇచ్చారు.

ఓం తత్సత్ !

## రెండవ అధ్యాయము

సర్వము తానే అయిన బ్రహ్మము ఎవరివల్ల, ఎట్లా తెలుసుకొనబడు తుంది? 'కేన' అనే మరో ప్రశ్నకు సమాధానం రెండవ అధ్యాయము.

### ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా !

**ఓం యది మన్యసే సువేదేతి దభ్రమే వాపి నూనం**
**త్వం వేత్థ బ్రహ్మణో రూపం, యదస్యత్వం యదస్య దేవేషు**
**అథను మీ మాంస్య మేవతే మన్యే విదితమ్ ॥** –2ఖం.మం.1

తాత్పర్యం : ఒకవేళ నీవు బ్రహ్మము రూపం బాగా తెలిసినది అను కున్నావా, ఖాయంగా అది చాలా స్వల్పమే. పరబ్రహ్మము యొక్క రూపం నీలో వున్నది. ఇంద్రియాల వెనుకాల ఉన్నది మాత్రమే తెలుసుకున్నావు. నీవు ఇంకా విచారణ చేయవలసినదే.

'తెలిసినదనే అనుకుంటున్నాను.' ఈ ప్రపంచంలో అనేక మిలియన్ల మనుషులు ఉంటే అనేక కోట్లు జీవరాశి ఉంటే **'పాదోస్య విశ్వా భూతాని। త్రిపాదస్యా మృతం దివి।'.** పరమాత్మలో ఒక పాదం బ్రహ్మాండం ఉంటే ఆ బ్రహ్మాండంలో నా రూపం ఎంత ! నా రూపం వెనుక, ఇంద్రియాల వెనుక ఉండే శక్తి ఎంత ! దానిని బ్రహ్మమని తెలుసుకోవడం చాలా స్వల్పమే. ప్రపంచమంతా విద్యుచ్ఛక్తి ఉంటే కోటాను కోట్లు బల్బులు వెలుగుతుంటే, ఫంకాలు తిరుగుతుంటే, అనేక కర్మాగారాలు పనిచేస్తూ వుంటే, అంతేకాక

వాతావరణంలో విద్యుచ్ఛక్తి ఉంటే, నా గదిలో గూర్చుని ఈ చిన్న బల్బులో విద్యుచ్ఛక్తే గొప్పది అనుకుంటే ఎంత మూఢత్వం.

సముద్రపు కప్ప నూతి కప్ప దగ్గరకు వచ్చింది. నూతి కప్పసముద్రపు కప్పను కుశల ప్రశ్నలు వేసినది. సముద్రము ఎంత ఉంటుంది అని ప్రశ్నించింది. చాలా పెద్దది అని చెప్పింది సముద్రపు కప్ప. నూతి కప్ప ఇంత ఉంటుందా అని ఎగిరి అడిగింది. సముద్రపు కప్ప నవ్వుకుంది. మళ్ళీ ఎగిరి ఇంత ఉంటుందా అని అడిగింది. మళ్ళీ నవ్వుకుంది. ఈ కూపస్థ మండూకానికి సముద్రము యొక్క అనంత తత్త్వం ఎలా తెలుస్తుందని!

మనము కూడా కూపస్థమండూకమువలె ఈ బ్రహ్మాండములో ఈ చిన్నరూపం వెనుక, ఇంద్రియముల వెనుక ఉండే శక్తిని బ్రహ్మము అనుకుంటే ఎంత మూఢత్వం. ఇంకా విచారణ చేయవలసినదే. దేవః అంటే **'ద్యోతనాత్ దేవః'.** ఇంద్రియాల గోళాలు వెనుక వెలిగించే శక్తులను దేవః అన్నారు. ఇంద్రియాల వెనకాల ఉండేశక్తి బ్రహ్మము నుండి వచ్చినది అని తెలుసుకుంటే చాలదు. అది కూడ బుద్ధితో తెలుసుకునేది. బుద్ధిని అధిగమించి అనంతమైన పరమాత్మ విచారణ సాగించాలి. ఈ విషయాన్ని గురువు సూచించగా, ఉత్తమ శ్రేణికి చెందిన శిష్యుడు 'స్వామీజీ' నాకు తెలిసినది అని విన్నవించుకున్నాడు.

**నాహం మన్యే సువేదేతి, నోన వే దేతి వేదచ ।**
**యో న స్త ద్వేద తద్వేద, నోన వేదేతి వేదచ ॥** –2ఖం.మం.2

నేను బాగా తెలుసు అనుకోను, తెలియదని కాదు. తెలుసుకూడాను, మాలో దానిని తెలుసుకున్న వాడు దానిని ఎరుగును. తెలియదన్న వాడు కూడా ఎరుగును. బయట ఉండే విషయ జ్ఞానాన్ని బుద్ధి తెలుసుకుంటుంది. ఆత్మ బుద్ధికి అతీతమైనది. బుద్ధికి చైతన్యాన్ని ఇచ్చేది. ఆత్మని బుద్ధి తెలుసుకోలేదు. కాబట్టి 'తెలుసును' అనే పదం ఆత్మానుభవానికి అన్వయించదు. తాను పొందిన ఆత్మానుభవాన్ని వర్ణించడం ఎలా ? అనుభవంచేత తెలిసనవాడు 'తెలుసును' అనే పదం ఆత్మానుభవానికి అన్వయించదు.

తాను పొందిన ఆత్మానుభవాన్ని వర్ణించడం ఎలా ? అనుభవంచేత తెలిసనవాడు 'తెలుసును' 'తెలియదు' అని రెండు మాటలను వాడి 'నాకు

కలిగిన అనుభవం బుద్ధి విషయంకాదు' అని స్వామీజీ వారికి విన్నవించాడు. ఈ ఉత్తమాధికారి అయిన శిష్యుడు పరిపూర్ణఅనుభవం పొంది సెలవు తీసుకున్నాడు. అనుభవం పొందని శిష్యులకు అదే విషయాన్ని మరో విధంగా వివరించారు.

**యస్యా మతం తస్య మతం మతం యస్య న వేదసః।**
**అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాత మవిజానతామ్ ॥** –2ఖం.మం.3

తాత్పర్యం : తెలియదన్నవారు దానిని ఎరుగుదురు. తెలుసునన్న వారు ఎరుగరు. విజ్ఞానవంతులకు అది తెలియదు. అజ్ఞానులకు అది తెలుసును.

వాక్కును అందరాదనిది వాక్కుతోనే అందించాలి. ఎందుకంటే మన మందరము బుద్ధిస్థాయిలో ఉన్నాము. వాక్కుకి అందరానిది అందించాలి అంటే వాక్కుకి వాక్కుకి చెప్పడానికి వీలులేనిది ఒక్కొక్క పదాన్ని ఉపయోగించి పదానికి అతీతమైనది చెప్పాలి. ఈ పదము నిరూపించదు. ఆ పదము నిరూపించదు. పదానికి పదానికి మధ్యలో ఉన్న గురువుగారి అనుభవము శిష్యునకు అందుతుంది. టీ త్రాగాలి అంటే నేరుగా టీ త్రాగలేము. పాత్ర కావాలి. అలాగే వాక్కుకి అందరానిది పదాల ద్వారా అందించాలి అంటే పరస్పర విరుద్ధ పదాలను వర్ణించుతారు. అందుకే 'అవిదిత' అన్నారు. 'విదితమే' అంటే బుద్ధిలో ఉన్నది. 'అవిదతమే' బుద్ధిలో లేనిది.

విదితం అంటారా అవిదితం అంటారా ! అనుభవం పొందినవారు ఎలా చెప్తారు. మన భాషలో బుద్ధిస్థాయిలో రెండే మాటలు ఉన్నాయి. అనుభవ మైన దానిని చెప్పడానికి వాక్కు తప్ప ఏమిలేదు. బుద్ధికి అతీతమైన అనుభవం బుద్ధిస్థాయిలో చెప్పవలసి వచ్చినప్పుడు 'విదితమ్' 'అవిదితమ్'అని వాడవలసి వస్తుంది. బుద్ధి తెలుసుకోవటంలేదు, బుద్ధి దాటి వెళ్ళాలి. బుద్ధి తెలుసుకోవ డానికి వీలు లేదు కాబట్టి 'నవేద' అన్నారు. బుద్ధికి అతీతంగా ఉన్న దానిని తెలుసుకోవడం వేద అన్నారు. బుద్ధి అధిగమించినట్లయితే 'వేద' అన్న తప్పులేదు, 'నవేద' అన్న తప్పులేదు. బుద్ధిని అధిగమించకుండా 'వేద' అంటే పతనమయినట్లే. అది అందుకున్నవాడు 'నవేద' అన్నవాడు నిజంగా అనుభవం పొందినవాడు. అందుచేత 'నవేద' అన్నవాడికి తెలుసు.

'యః నఃతద్ వేద' ఎవరయితే తెలుసును అంటున్నారో, ఆయన అనుభ వించి చెప్పుచున్నారు, కాబట్టి తెలుసును అన్నా తప్పు లేదు.

'నవేద' తెలుసుకోవడానికి వీలు లేదు అన్నారు. అంటే బుద్ధి స్థాయిలో తెలుసుకోలేము. ఇద్దరు అన్నదమ్ములు గురుకులమునకు వెళ్ళిరి. విద్యాపూర్తి అయిన తరువాత తిరిగి వచ్చిరి. తండ్రి చిన్నఅబ్బాయిని బ్రహ్మమంటే ఏమిటని ప్రశ్నించెను. సుమారుగా 5,6 గం॥ బ్రహ్మను గూర్చి వర్ణించెను. బ్రహ్మమంటే ఏమిటని పెద్దబ్బాయిని ప్రశ్నించెను. తాను ఏమి మాట్లాడలేదు. బ్రహ్మమంటే ఏమని చెప్తారు. తానే బ్రహ్మము. అందుకే **"యస్య అమతం తస్యమతం"** తెలియదన్న వారు దానిని ఎరుగుదురు. చిన్న అబ్బాయి, 'యస్య మతం నవేదసః' తెలియని వారే అలా వర్ణిస్తారు.

నారదుల వారు దేశసంచారం చేస్తూ ఉంటే, మహాత్ములందరూ తపస్సు చేస్తున్నారు. నారదుడు మహాత్ములారా దేనికోసం తపస్సు చేస్తున్నారని ప్రశ్నించెను. పరబ్రహ్మము గూర్చి తపస్సు చేస్తున్నాము అన్నారు. నారదుల వారు దేశసంచారము చేసి వచ్చారు. వారు ఇంకనూ తపస్సు చేస్తూనే ఉన్నారు. ఇలా నారదుల వారు 1,000 సంవత్సరాలకు ఒకసారి చొప్పున నాలుగుసార్లు వచ్చారు. 5వసారి నారదుల వారు తిరిగి వస్తున్నప్పుడు మహాత్ములందరూ కమండలము దర్భచాపలు తీసుకొని వెళ్ళిపోతున్నారు. నారదులవారు మహాత్మ దర్శనము అయినదా అని ప్రశ్నించెను. పరమాత్మ దర్శనము పొంద లేమని తెలిసి తిరిగి వెళ్ళిపోవుచున్నామని చెప్పారు. ఆ విధంగా బుద్ధి స్థాయిలో తెలుసుకోలేని దానిని అనుభవంతో తెలుసుకోవాలి.

పరస్పర విరుద్ధాలయిన మాటలతో మాటలకందరాని మహా అనుభవాన్ని గురువు గారు వివరించారు. కాని ఈ శిష్యులు ఏమియును గ్రహించ లేదు. అందుకని వారి కోసం గురువుగారు ఒక ఉపాసన వివరిస్తున్నారు.

**ప్రతి బోధ విదితం మతం, అమృతత్వం హి విన్దతే ।**
**ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతే ఽ మృతమ్ ॥** -2ఖం.మం.4

తాత్పర్యం : ప్రపంచము నుండి క్షణక్షణము కలిగే ప్రతి విషయ జ్ఞానముతోను ఆత్మచైతన్యము తెలియబడుతోందని నా అభిప్రాయం. నిజానికి అమరమైన ఆత్మనే పొందుతున్నాడు. ఆత్మవల్ల బలాన్ని పొందుతాడు. జ్ఞానం వల్ల అమరత్వాన్ని పొందుతాడు.

పుష్పముల గుత్తు ఉన్నది. అది లోపల ఉండే ఆత్మచైతన్యంతో కలిసినప్పుడే పుష్పముల జ్ఞానము కలుగుతుంది. వృక్షముల జ్ఞానమును, జంతువుల

జ్ఞానమును అనేక రకాల జ్ఞానమును ఆత్మచైతన్యం మూలంగా కలుగుతుంది. అయితే మనము విషయ వస్తువులను అనుభవిస్తున్నాము. విషయజ్ఞానాలు తెలుసుకుంటున్నాము విషయ జ్ఞానం ఎక్కడనుండి వచ్చిందో ఆయనను మరిచిపోతున్నాము.

లోతుగా ఆలోచించి చూచితే విషయ జ్ఞానంలో మనకు కనబడేది విషయ వస్తువుకాదు. విషయ వస్తువు రూపం ధరించిన చైతన్యమే. వస్తువు మనకు బయటనే ఉన్నది. జ్ఞానం లోపల కలుగుతోంది. లోపల చైతన్యం బయటకు వెళ్ళి విషయ వస్తువు రూపాన్ని ధరించి తిరిగి వస్తుంది. దానినే మనం విషయ జ్ఞానం అంటున్నాము. అది చైతన్యమే.

మన ప్రతీ కదలిక ఆత్మచైతన్యం వల్లనే కలుగుతుంది. చనిపోయిన వ్యక్తిలో ఏ కదలిక లేదు. ఆత్మను గురించిన జ్ఞానం లేకపోతే జననమరణ సాగరములో మునిగి తీరవలసినదే. ఆత్మను తెలుసుకుంటే అమృతత్త్వం లభిస్తుంది.

**ఇహ చేదవేదీత్ అథ తత్ సత్యమస్తి నచేదిహావేదీ న్మహతీ వినష్టిః।**
**భూతేషు భూతేషు విచిత్య ధీరాః ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవన్తి॥**-2ఖం.మం.5

ఈ లోకంలో జీవించి ఉండగానే తెలుసుకుంటే ఈ మహాసత్యం ఉంటుంది. తెలుసుకోలేని వారికి ఎంతో నష్టం. వివేకవంతులు అందరి జీవులలోను లోతుగా తరిచి చూచి ఈ లోకం నుండి వెళ్ళిపోయి అమరులవు తారు. ఎవరిచేత ఆత్మను తెలుసుకోవచ్చును అనే ప్రశ్నకు సమాధానంగా ఆత్మను ఆత్మే తెలుసుకుంటుంది, బుద్ధి ద్వారా తెలియబడదు అని చెప్పబడి నది. (ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా !)

ఓం తత్సత్ !

## మూడవ అధ్యాయము

ఎవరికారణంగా జిజ్ఞాస కలుగుతుంది. పరబ్రహ్మము దేవతలకోసం విజయాన్ని సాధించెను. అప్పుడు దేవతల సంతోషం ఇంతఅంత అని చెప్పతరం గాకపోయింది. ఆ విజయానికి కారణం అంతా తమశక్తి సామ ర్థ్యాలే అని అనుకున్నారు. వారందరికి అహంభావం పెరిగిపోయింది. నేనింత వాణ్ణి, నేనంతవాణ్ణి అని స్వోత్కర్షకు పూనుకొన్నారు. గెలిచాము కదా యని విజయోత్సవం చేసుకుంటున్నారు. పరమాత్మ వాళ్ళ అహంభావాన్ని కని

పెట్టాడు. వీళ్ళకున్న అహంభావం పోతేకాని వీళ్ళకు క్షేమంలేదని అనుకున్నాడు. దేవతలకు అల్లంత దూరాన భూమి ఆకాశము నిండేటట్లు చూడడానికి వీలుకాని ఒక ప్రకాశం ఆవరించింది. దానిని చూచిన దేవతలకు ఆశ్చర్యం కలిగింది. ఇదేమిటో తెలియడం లేదే అనివారు అనుకున్నారు. దేవతలు అగ్నిని సమాపించి ఇలా అడిగారు. జాతవేద! అపూర్వమైన రూపం ఏదో పరిశీలించి తెలుసుకో. అలాగా యని అగ్ని ఆ ప్రకాశం ఉన్న చోటుకు పరుగు తీసాడు. నీవు ఎవరు అని అడుగుదామని అగ్ని అనుకుంటూ ఉండ గనే ఆ ప్రకాశమే అగ్నిని, 'నీవెవరు?' యని ప్రశ్నించును. నేనా, నేనుజాత వేదుడను, జాతవేదుడు అంటే వేదాలలో పుట్టినవాడు. లేదా వేదాలు ఎవరి నుండి పుట్టాయో అతడు. ఒక గొప్ప బిరుదును కలిగి ఉన్నావే అట్టి నీకు ఏమి శక్తులున్నాయి? యని బ్రహ్మము అడుగగా, అగ్ని ఈ ప్రపంచములో యావత్తును కాల్చివేయగలను. ఏది నీ శక్తిచూద్దాం, ఒక గడ్డిపోచను వుంచి దీనిని కాల్చు అన్నది. అగ్ని ఇంతేనా అని నవ్వుకున్నాడు. అగ్ని దేవుడు తన సర్వ శక్తులను కూడ గట్టుకొని గడ్డిపరకను సమీపించాడు. కాని కాల్చలేక పోయాడు అగ్ని అవమానంతో వెనుదిరిగాడు.

అప్పుడు దేవతలు వాయువును సమీపించి, ఓ వాయువా ! ఈ అద్భుత రూపాన్ని పరిశీలించమనిరి. వాయువు సరే అన్నాడు. వాయువు ఆ ప్రకాశము వైపు పరుగు తీశాడు. ఆ ప్రకాశము ఎవరు నీవు యని ప్రశ్నించింది. నేను మాతరిశ్వుడను అని వాయువు సమాధానం చెప్పెను. మాతరిశ్వుడు అంటే ఆకాశంలో సంచరించేవాడు లేదా ఆకాశంలో ఊపిరి పీల్చేవాడు అని అర్థం. ఇలా గొప్ప బిరుదు కలిగి ఉన్నావే నీలోయేమి శక్తి ఉన్నది? అని యక్షుడు ప్రశ్నించెను. ఈ ప్రపంచంలో ఉన్న యావత్తుని నేను ఎగురగొట్ట గలను అని వాయువు సమాధానం చెప్పెను. వాయువునకు యక్షుడు ఒక గడ్డిపరకను వుంచి దీన్నిఎగురగొట్టు అన్నాడు. వాయువు దానిని సర్వశక్తులతో సమీపించి కూడా ఎగురగొట్టలేక పోయాడు. ఈ యక్షుడెవరో తెలుసుకునే శక్తి లేక అతడక్కడనుండే వెనక్కి వచ్చాడు.

ఇంద్రుడు ఆలోచించసాగాడు. జయం కలిగింది కదా ఆనందంగా ఉంటే ఈ వెలుగు గొడవ ఒకటి వచ్చి పడింది, ఈ వెలుగునకు ఎంత శక్తి వుందో, ఎంతశక్తి లేకపోతే అగ్ని దేవునకు, వాయు దేవునకు సులభంగా

శృంగభంగంచేసి వెనుకకు మరల గొట్ట గులుగుతుంది? యోచించే కొద్దీ అహంభావం కొంత కొంత పోయి పరమాత్ముని గురుతు ఆ దేవతా ప్రభువునకు కలుగ సాగింది.

దేవతలందరూచేరి ఆ యక్షడెవరో కనుక్కోమని అడిగారు. అలాగేనని ఇంద్రుడు ఆ యక్షరూపంవైపు వెళ్ళాడు. ఇంద్రుడు యక్షుడు మాయమై ఆశూన్యంలో బహుశోభితురాలు హిమవంతుని కుమార్తె అయిన ఉమాదేవిని చూచాడు. అమ్మా ఈ అద్భుత రూపం ఎవరిది. అని అడిగాడు. జిజ్ఞాస ఎలా కలుగుతుంది అనే ప్రశ్నకు ఇంద్రుడి స్థితికి వచ్చాక కలుగుతుంది. ఎలా కలుగుతుంది అనే దానికి మానవ జీవితాన్ని పరిశీలించాలి.జిజ్ఞాస వచ్చేది, ప్రశ్న వేసేది ఇది ఏమిటి అనే ప్రశ్న వేసే స్థితి మానవుడు ఒక్కనిదే మానవుడుగా జన్మరావడానికి పూర్వం 84 లక్షల జన్మలు తిరిగామని మన సంస్కృతి వేదమతం చెప్తుంది.

పాశ్చాత్య దేశాలు మనం వేరు, తక్కినవాళ్ళు వేరు అని చెప్తారు. జీవాలు ఎలా పుట్టాయి అని చెప్పే మానవ శాస్త్రమును వారు విశ్వసిస్తారు. ఎప్పుడో కోట్ల సంవత్సరాలకు పూర్వము సూర్యుడునుండి భూమి వేరుఅయి వచ్చాక భూమి తన చుట్టూ తానుతిరుగుతూ సూర్యుడు ప్రక్క తిరుగుతూ ఉంటే గాలి ఏర్పడింది, ఎండ పుట్టింది, మేఘాలు ఏర్పడ్డాయి. వర్షాలు వచ్చాయి. సముద్రాలు ఏర్పడ్డాయి, నదులు ఏర్పడ్డాయి. ఈ ప్రకారంగా ఉండగా సప్త సముద్రాలు కూడినటువంటి భూమిలో లోతుగా ఉండే పసిఫిక్ మహాసముద్రంలో అట్టడుగున మొట్టమొదటిసారిగ జీవం పుట్టింది అన్నారు. ‘అమీబా’ అను ఒక్క జీవకణం పుట్టింది. మనశరీరంలో 261/2 మిలియన్ల జీవకణాలు ఉన్నాయి. అంటే, ఒక్క జీవకణము అంటే ఎంతో పరిశీలించండి. ఎంత పెద్ద శక్తివంతమైన అద్దములువేసి చూసినా కనిపించదు. అమీబా ఆడకాదు, మగకాదు. రెండు కణాలుగా ఎదిగి రెండుగా విభజన జరగడం ఆ రెండు నాలుగుగా విభజన జరుగుతుంది.

ఈ విధంగా కొన్నివేల సంఖ్య వరకు ఉత్పత్తి అయినవి. కొంతకాలం అయిన తరువాత ఎప్పుడూ ఈ సముద్రంలోనే ఉండడమా అని ఆలోచన చేసి కొత్త లోకాలు చూడడానికి కొన్ని వచ్చాయి. అలా పైకి వచ్చినప్పటికి అనేకజలచరాలు పుట్టాయి. ఎప్పుడూ ఉప్పు నీటిలో ఉండడమా అని

ఆలోచించి సముద్రములు నదులు కలియు స్థలానికి వచ్చాయి. నదుల నీరు బాగుందని నదులలోనికి ప్రవేశించాయి. కొన్ని తరాలు జరిగిన తరువాత ఇలా ఉపనదులు బావున్నాయని అందులో ప్రవేశించాయి. కొన్ని తరాలు తరువాత ఉపనదులలో నీరు తగ్గిపోయింది. నీరు లేకపోతే బ్రతకలేమని కొన్ని చేపలు ఎగరడానికి ప్రయత్నించి చెట్ల మీదపడి రెక్కలను అభివృద్ధి చేసుకొని పక్షులుగా మారాయి. కొన్ని నీళ్ళలో నుండి ప్రాకడానికి ప్రయత్నించాయి. అలా ప్రయత్నించడములో కొన్ని నీళ్ళమీద భూమిమీద బ్రతికే Anti B.S.Animals అయ్యాయి. కొన్ని తరాల తరువాత సాహసం చేసి అడవుల లోనికి వెళ్ళడం మొదలు పెట్టాయి. ఆ తరువాత మన పూర్వీకులు చిన్న చిన్న తోకలు కల వాళ్ళు వచ్చారు. తరువాత మనము వచ్చాము. ఇది మానవుని దశ. చార్లెస్ డార్విన్ అనుశాస్త్రవేత్త 18వ శతాబ్దములో అస్థిపంజర ములను పరిశీలించి ఒరిజన్ ఆఫ్ సైన్సస్ అని వ్రాసారు. మానవుడు అత్యున్నత దశని చెప్పారు.

అన్ని చిన్న చిన్న జీవులు బలిదానం చేసినందువల్ల మానవుడు వచ్చాడు. అన్ని చిన్న జీవులు బలిదానం ఎందుకు చేసినట్లు? అవన్నీ బలిదానం చేయలేదని వేదాంతం చెప్తుంది. నీవే అమీబాగా ఉన్నావు. పైకి వచ్చావు. నదులలో ప్రవేశించావు. చివర దశలో మానవుడుగా రావడానికి 84 లక్షల జీవరాశులలో నీవే తిరిగావని వేదాంతం చెప్తుంది. అమీబాకి అంత తెలివి ఎక్కడిది? లోపల దేవుడు కూర్చుని ఒక్కొక్క దశలో నడిపించాడు, మనము నీటిలో ఉన్నప్పుడు ఆయన మత్స్యావతారమున దిగివచ్చి అను గ్రహించి ఈదడం నేర్పాడు. సముద్రంపైకి వచ్చి, నదులలోకి తీసుకువచ్చి ఉపనదుల వరకు తీసుకువచ్చాడు. నీరు ఎండిపోయిన స్థితిలో చచ్చిపోయే స్థితిలో నడవడానికి పాకడానికి జలచరంగాను, భూచరంగా ఉండి తానే ధైర్యమిచ్చి నడవడానికి ఆయన కూర్మావతారంగా వచ్చాడు. నేల మీద బ్రతక డానికి వీలుగా వరహావతారము ఎత్తాడు. నరసింహుడుగా వచ్చి అడవులలో సంచరించడానికి ప్రేరణ ఇచ్చాడు.

మానవుడుగా వచ్చినప్పటికి వామన అవతారముగా వచ్చాడు. ఆయన లోపల కూర్చుని మూడు అడుగులు ఇవ్వుము అని కూర్చున్నాడు. 'మధ్యే ఆత్మని తిష్ఠతి' (కఠోపనిషత్తు) మధ్యలో పురుషుడు ఉన్నాడు. ఆయన మూడు

అడుగుతున్నాడు. ఏమూడు ఇవ్వమని అడుగుతున్నాడు. సత్త్వగుణం, రజో గుణం,తమోగుణం. మూడు ఇవ్వమని అడుగుతున్నాడు. తమోగుణం మనలో అంతం చేయడానికి పరశురాముడిగా వస్తాడు. వచ్చి అన్ని నరికి వేస్తాడు. క్షత్రియులను నాశనం చేయడానికి క్షత్ అంటే నాశనం చేయడం తమో గుణాన్ని నాశనం చేయడానికి పరశురామ అవతారం వచ్చింది. తమో గుణం నశించి రజోగుణం పెరిగినప్పుడు దశరధరాముడు వస్తాడు. 5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు మీద తిరిగేవాడు లోకాన్ని యావత్తు అయోధ్యగా తీసుకుంటాడు. ఇప్పుడు మనం ఉన్నది ఆ దశలోనే, ఎక్కడెక్కడో రాకెట్లు పంపిస్తున్నాము. సముద్రం అట్ట అడుగున ఏమున్నదో తెలుసుకుంటు న్నాము. అణువుని ఛేదిస్తున్నాము. అంతా బాగానే వుంది, రజోగుణంలో ఏమి సాధించినా పదిఇంద్రియాల విలసనం తప్ప మరేమి లేదు. పది ఇంద్రి యాలతో అన్నీవశం చేసుకున్నాక పది ఇంద్రియాలు, 10 తలల రాక్షసుడై రావణాసురుడు వస్తాడు. ఆ రావణాసురుని తలకొట్టడానికి దశరధ రాముడిగా వస్తాడు. 101 సారి కొట్టాడు. ఇంద్రియ శక్తితగ్గదు. చివరకు బ్రహ్మాస్త్రం వేసాడు. పరబ్రహ్మము నామముతో పోవాలి. లోకాన్ని అంతా జయించాను అని అహంభావం ఉన్నదే, అది రజోగుణం లక్షణం.

ఇప్పుడు ఈ కథయొక్క భావాన్ని చూద్దాం. ఈ విజయం అంతా ఎవరిది? ఇంద్రియశక్తులని దేవతలంటారు. ఈ దేవతలు అన్నీ పరిశీలిస్తాయి. ఈ మానవశరీరంలో ఏముందో తెలుసుకుంటాయి. వృక్షంలో ఏముందో తెలుసుకుంటాయి. జ్యూపిటర్‌లో ఏముందో, వీనస్‌లో ఏముందో తెలుసు కుంటాయి. ఈవిజయం ఎవరిదండి. బ్రతికి ఉన్నంతకాలమే అన్నీ. పరమాత్మ వెళ్ళిపోతే ఏమి విజయం లేదు. ప్రకృతి విజయాలన్ని ఆయనవే. దేవుడు లోపల ఉండి విజయాన్ని ఇస్తున్నాడు. పరమాత్మ శక్తి లేకపోతే ఏ ఇంద్రియము నకు శక్తి ఉండదు. ప్రకృతిలో అన్ని విజయాలను పొందు తున్నాడు. ప్రకృతిలో శాస్త్రజ్ఞులు ఎన్నో కొత్తవిషయాలని కనిపెడుతున్నారు, సూర్యునినుండి హిలియా అనుమేటరు లైటు ఎనర్జీగా,హీట్ ఎనర్జీగా ఏటమ్స్ బద్దలయి వస్తుంది అని కనుక్కోవడం మహాగొప్ప. అది బద్దలయే శాసనం పెట్టింది ఎవరు? ఏటమ్‌లో $E=MC^2$ నియమం ప్రకారం ఎనర్జీ ఉందని చెప్తారే. అందు శక్తిని నిలవ చేసింది ఎవరు? అనే ప్రశ్న. భూమికి ఆకర్షణశక్తి

పెట్టింది ఎవరు ? అనే ప్రశ్న ఉదయిస్తుంది. 'కిమిదం యక్షమితి' ఎవరు పెట్టారు అనే దానికి సమాధానం రాదు.

ఎవరు యక్షుడు అని కనుక్కోవడానికి అగ్నిని పంపారు? కర్మేంద్రియా లకి ప్రతినిధి వాక్కు వెళ్ళి పరమాత్మను కనుక్కోగలదా ! ఏదయితే వాక్కు చేత వెల్లడింపబడదో, దేని కారణంగా వాక్కు వెల్లడవుతుందో అది బ్రహ్మము. వాక్కు తిరిగినప్పుడు కాల్చలేక పోయింది. వాక్కు శక్తిపోయింది. కళ్ళజోడు వెనుక కళ్ళు ఉన్నంత కాలము ఈ కళ్ళజోడులో నుండి నాకు అన్ని కనిపిస్తాయి. ఈ కళ్ళజోడు కళ్ళు చూద్దామని వెనక్కి తిరిగితే కళ్ళకు ఏమి కనిపిస్తాయి? అట్లా ఎప్పుడయితే ఈ వాక్కు పరమాత్మవైపు తిరిగిందో ఈ వాక్కు అట్లు వెనక్కి తిరిగింది. ఇలా కర్మేంద్రియాలు ఏవి పరమాత్మను కనుక్కో లేవు. జ్ఞానేంద్రియాలకు అధిపతి వాయువును పంపారు. జ్ఞానేంద్రియాలు మాత్రము పరమాత్మను ఏమి తెలుసుకుంటాయి?

**'ఇంద్రియాణాం రాజా ఇంద్రః'** ఇంద్రుడు మనసు. ఇంద్రియాలు విఫలమవడంతో మనస్సు శూన్యమయినది. ఈ శూన్యస్థితిలో ఉన్న మన స్సుకు హిమాలయకుమార్తె ఉపనిషత్‌మాత, పార్వతి మాత గోచరమవుతుంది.

ఉమ–'మ'లో=మకారం, అకారం ఉన్నాయ. 'అ' తీసుకువచ్చి 'ఉ' ముందు ఉంచితే అ+ఉ+మ ప్రణవదేవి ప్రత్యక్షమయింది. స్త్రీ అంటే స+ర+త+ఈ కారము కలిసినది. స=అంటే సత్త్వము. ర=అంటే రజస్సు, త=అంటే తమోగుణము. మూడు గుణాలు కలసి 'ఈ'అంటే కదిలేది. మొత్తం బ్రహ్మాండమంతా త్రిగుణాత్మకమై కదిలేది. ఈ ప్రకృతికి యావత్తు ఆమె మాత. 'బహూశోభమానం' ఉపనిషత్తు మంత్రాలు మధురమైన ధ్వని. అన్ని శాస్త్రాలు చదివాడు. ఏ శాస్త్రంలో ఆకర్షణశక్తి ఎవరు పెట్టారు అని చెప్పలేదు. అందుకని ఏమిటి అని అడిగాడు. 'కిమిదం యక్షమితి.' ఈ ప్రపంచంలో శోధనలు చేసి అన్ని శాస్త్రాలు చదివినా ఇంకా రహస్యము ఇందులో దొరకదు. వేదాంతంలో దొరుకుతుంది అనుకునే వాడికి జిజ్ఞాస.

ఈ జిజ్ఞాస ఎలా వచ్చింది ? కేన–కేన ఆయనచే పరబ్రహ్మచేత, లేక పోతే అలా చేపలు లాగ ఉండే వాళ్ళము. దశావతారాలు ఎత్తి తీసుకువచ్చాడు.

ఇప్పుడు ఈ దశలో ఉండగా దశరథరాముడి దగ్గర నుండి బలరాముడి దగ్గరకు రావాలి. బలరాముడు బ్రహ్మానందంలో ఉండేవాడు (నిర్గుణసత్త్వంలో)

ఆ సత్త్వగుణం పోయినప్పటికి మిగిలేది బుద్ధప్రబోధం (జ్ఞానం). ప్రబోధం వచ్చాక తక్కినవాళ్ళని దాటింపజెయ్యాలని వస్తాడు. అది కల్కి అవతారము. అశ్వం మీదెక్కి వస్తాడు. అశ్వం అంటే గురువు. తానుపొందిన అనుభవాన్ని అందరికి వివరిస్తారు. దశావతారాలు దీనితో సమాప్తం. కృష్ణుడు పరిపూర్ణుడు, పరిపూర్ణం దగ్గరకు చేరుకోవాలి. రాక్షసులతో గెలుపు కాదు ఇది. ఇంద్రియాలు ప్రకృతి శక్తులను జయించిన స్థితి. భూమికి ఆకర్షణశక్తి లేకపోతే మనం వుండే వాళ్ళంకాదు. ఎగిరిపోయే వాళ్ళము. 34 అడుగుల వరకు గాలి వత్తిడి ఉంది. ప్రక్కనుండి గాలి ఒత్తిడి ఉండాలి. పైనుండి గాలి వత్తిడి అదిమి పెట్టాలి. కింద ఆకర్షణ పట్టి లాగాలి. ఇది అంతా ఎవరు పెట్టారు? పైకి వెళితే ఏ శబ్దం ఉండదు. ఇక్కడ ఇన్ని శబ్దాలు ఉన్నాయి. ఎవరు పెట్టారు? భూమిలో విత్తనాలు నాటితే చక్కటి ఫలాల్ని ఆస్వాదిస్తున్నాము. ఆ ఫలాలని ఎవరు అందించారు? 'కిమిదం యక్షమితి?' అనే ప్రశ్న వేసే స్థితి తీసుకురావడానికి ఆ పరమాత్మే తీసుకు వచ్చాడు.

ఓం ! ఓం ! ఓం !

## నాల్గవ అధ్యాయము

### ప్రేమైక మూర్తి ! నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.

భగవంతుడు ప్రేమ స్వరూపుడు. అందుకని ఒక్క జీవకణంగా ఉన్న 'అమీబా' స్థాయి నుండి లక్షలాది యోనులలో దశావతారములు దాల్చి మానవుడుదాక తీసుకువచ్చి మానవుడికి అయిదు జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధిని అమర్చి వాటి సహాయంతో లోకాన్ని యావత్తుని జయించేటట్లు చేసేది భగవంతుడు. ప్రేమస్వరూపుడు కనుకనే మననుండి ప్రతిఫలాన్ని ఆశించకుండా సర్వ విధముల ప్రకృతిలో మానవుడు సుఖాన్ని పొందుటకు సిద్ధపరచెను. ప్రేమస్వరూపుడైన భగవంతుని తెలుసుకొనుటకు మనం చేయవలసినపురుషప్రయత్నంగురించి ఈనాల్గవఅధ్యాయంలో వివరిస్తున్నారు.

ఉపనిషత్తు మాత ఉమ–అది బ్రహ్మము అని చెప్పింది. ఆ పరబ్రహ్మము సాధించిన విజయముతో మీరు గొప్పదనము పొందుతున్నారు. ఏమిటి

విచిత్రము అంటే ఉపనిషత్తులో 'ఉమ' పరబ్రహ్మము వలనే విజయము పొందుతారని చెప్పిన విషయమును ముగ్గురు దేవతలు విశ్వసించడమనేది గొప్ప విషయము. ముప్పది మూడుకోట్ల దేవతలు ఉంటే అందులో ముగ్గురే అగ్ని, వాయువు, ఇంద్రుడు బ్రహ్మమును తెలుసుకోవడానికి ప్రయత్నించారు. అందుచేత ఈ ముగ్గురు దేవతలు ఇతర దేవతల కన్న అధికమైనవారు.

ఇంద్రుడు దానిని సమీపించి తాకి ప్రథమంగా బ్రహ్మమని తెలుసుకున్నాడు. అందువల్ల ఇంద్రుడు ఇతర దేవతల కన్న అధికంగా కనబడతాడు. మెరుపువలె కన్నురెప్పపాటువలె, ఇదివరలో ఏ ఆదేశం తనకు వచ్చినదో అవి యావత్తు ఈ బ్రహ్మము నుండే అని తెలుసుకున్నాడు.

అయితే ఈ దేవతలు ఎక్కడలో లేరు మనలోనే ఉన్నారు. ప్రతి వారిలో అగ్ని (కర్మేంద్రియములకు ప్రతినిధి), వాయువు (జ్ఞానేంద్రియమునకు ప్రతి నిధి), ఇంద్రుడు (మనస్సు), ఉన్నాయి 6 కోట్ల మిలియన్ల మానవులు వుంటే ఏ అగ్ని, ఏ వాయువు, ఏ ఇంద్రుడు సద్వినియోగం అవుతున్నారు. ఏ ఒక్క అగ్నియో, ఏ ఒక్క వాయువువో, ఏ ఒక్క ఇంద్రుడో వారి జీవితాలని సద్విని యోగం చేస్తున్నారు. ఈ మానవ జన్మ అనేక సత్కర్మల ఫలం వల్ల వచ్చింది. మానవ శరీరము ఒక 'చింతామణి' వంటిది. ఒక బీదవానికి ప్రేమ స్వరూపుడగు సంతుని దర్శనము కలిగినది. అతడు బీదవాడైనందున ప్రేమతో ఆ సంతు అతనికి చింతామణి ఇచ్చెను. అతడు దానిని తీసుకొనెను. కాని ఆ ప్రకాశవంతమగు పదార్థము ఏమియో అతడు గుర్తించలేకపోయెను. అది ఒక రాయి మాత్రమే అనుకొని అతడు ఒక కూరల దుకాణమునకు వెళ్ళి 'అన్నా! ఈ ప్రకాశవంతమగు పదార్థమునకు కూర ఇమ్ము.' అని అడిగెను. అతనికి ఆ రాతికి బదులు ఒక రూపాయి కూర లభించెను. అది తీసుకొని అతడు వెళ్ళెను. తరువాత ఒక బంగారు వర్తకుడు అటు వచ్చెను. అతడు ఆ రాతిని చూచి ఇది సామాన్యపు రాయికాదు, విలువ కలది అనుకొని ఆ రాతికి 200 రూ॥లు ఇచ్చెదననెను, అప్పుడు ఆ కూరల వర్తకుడు, ఆ రాతి వెల ఇంకా ఎక్కువ ఉండునని భావించెను. 200 రూపాయలకు అమ్మననెను. బేరము చేసి చివరకు ఆ వర్తకుడు ఆ రాతిని రెండువేల రూపాయలకు కొనెను. పిదప ఆ బంగారు వర్తకుడు ఆ రాతిని ఒక వజ్రముల వర్తకుని చెంతకు తీసుకొని వెళ్ళెను. వజ్రాల వర్తకుడు చింతామణిని లక్షరూపాయలు

ఇచ్చి కొనెను. పిదప ఆ వజ్రముల వర్తకుడు చింతామణిని రాజుగారికి సమర్పించెను. రాజుగారు ఆనందించి రెండుకోట్ల రూపాయలను ఇచ్చెను. ఈ శరీరము కూడా మూల్యములేని చింతామణి వంటిది. దీని విలువను తెలియని మానవుడు చింతామణికి బదులుగా ఒక రూపాయి కూరను తీసుకొనిన మూఢునివలె విషయ సౌఖ్యములు మాత్రమే పొందును.

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే**

**యతతా మపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥** (భ.గీ. 7-3)

వేలాది మనుష్యులలో ఏ ఒక్కరో మోక్షసిద్ధికోసం ప్రయత్నిస్తారు. ప్రయత్నించి సిద్ధులైన వాళ్ళలో కూడా ఏ ఒక్కరో నన్ను అసలు తత్త్వంలో తెలుసుకుంటారు. పరిమితులతో నిండిన ఈ ప్రపంచం నుండి అనంతుడైన పరమాత్మ స్థాయిని అందుకోవడం తేలిక కాదు. వేదాంతాన్ని వినే వాళ్ళు తక్కువ, విని అర్థం చేసుకొన్నా సాధనచేసే వాళ్ళు ఇంకా తక్కువ. సాధనలో కొంతవరకు నెగ్గి సిద్ధులు పొందే సరికి ఆ వ్యామోహంలో పడిపోతారేకాని వాటిని తప్పించుకొని అసలు తత్త్వాన్ని తెలుసుకునే వారు ఎంతో అరుదు. అగ్ని, వాయువు, ఇంద్రుడు మనుష్యులందరిలో ఉన్నాయి. వీటి సహాయంతోనే మానవులు లోకంలో జీవిస్తున్నారు. ఇందులో ఎవరయితే తమ అగ్ని, వాయువులను పరబ్రహ్మాన్ని తెలుసుకోవడం కోసం సద్వినియోగం చేస్తున్నారో వారే చింతామణిలాంటి మానవ జన్మను సార్థకము చేసుకుంటున్నారు. తక్కిన వాళ్ళు విషయ వస్తువుల వ్యామోహంలో పడి చింతామణికి బదులు కూర తీసుకున్న మూఢునివలె తమ అగ్ని,వాయువు,ఇంద్రుడులను వృథా చేసు కుంటున్నారు. ఆత్మతత్త్వాన్ని గూర్చి శ్రవణం చెయ్యాలి. పిదప మననం సాగుతుం డాలి. తరువాత సాధనపూర్తిగా అంతర్ముఖంగా జరిగేది. దానిని నిది ధ్యాసన అంటారు.

అంతర్గతమైనసాధనలో దేనివల్ల మనస్సు చలిస్తున్నట్లుగా ఉంటుందో, జరిగిపోయిన విషయాలను గుర్తు చేసుకుంటుందో, క్షణక్షణం కొత్త సంకల్పాలు చేసుకుంటుందో అదే పరబ్రహ్మము.

నిది. ధ్యాసన కోసం ధ్యానంలో కూర్చోగానే కనబడేది మనస్సు. చంచలంగా పరిగెత్తే మనస్సు దృష్టిని చెరిపేస్తుంటే సాధకుడు పరబ్రహ్మాన్ని

కనుక్కోవడము ఎలాగ ? పరుగెత్తే మనస్సుకు కారణం పరబ్రహ్మమే అని తెలుసుకుంటే మనస్సు యొక్క కదలికలకు ఆధారమైన పరబ్రహ్మవైపు దృష్టిని మరల్చవచ్చు. యుద్ధంలో వీరులైన సైనికులు శత్రువులను ఖండించునట్లుగా, ధీరుడైన సాధకుడు వివేకమనే ఖడ్గంతో తన ధ్యాన సమయంలో జనించే కల్పిత దృశ్యాలన్నిటిని ఖండించాలి.

అది 'తద్వనం' అంటే ఆరాధనీయమైనది అనేపేరు గలిగినది. ఆరాధ నీయమైనది అనే దానిని ఉపాసించాలి. అలా ఉపాసించి ఎవరు తెలుసు కున్నారో, అతణ్ణి జీవులందరూ ఆరాధించుతారు.

ప్రపంచంలో అందరూ ప్రేమించేది, ఆరాధించేది ప్రాణ రూపంలో జీవంతో కనబడే పరమాత్మనే. ప్రాణం పోయిన వెంటనే చనిపోయిన వ్యక్తిని దహనపరుస్తారు. బ్రతికి ఉన్నంత వరకు ఆ వ్యక్తికి రాజకీయహక్కులు, సామాజిక హక్కులు అన్ని ఉంటాయి. చనిపోయిన మరుక్షణంలో అన్నీ మాయం. అందువల్ల ప్రేమించదగినది, ప్రేమించుచున్నది ఆత్మనే. ఇలా సూటిగా ఆత్మను ఆరాధించే వారు ఆరాధనీయమైన దానిలో ఐక్యమైనందు వల్ల అందరికి ఆరాధనీయులవు తారు.

**ఆత్మ తత్త్వాన్ని ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము**

ముసలితనము వచ్చిన తరువాత సాధనచేయవచ్చునని, ఇప్పుడే ఎందుకని చాలమంది భావిస్తారు. మనకోసం కాలము ఆగదు. ముసలితనము వచ్చాక ఇంద్రియ శక్తులు క్షీణించి పోతాయి అప్పుడు ఏ విధమైన సాధన చెయ్యలేము. అందుకే శంకరులు ఈ విధంగా అంటారు.

**శ్లో॥ బాలస్తావత్క్రీడా సక్తః తరుణస్తావత్తరుణీ సక్తః**
**వృద్ధస్తావచ్చిన్తా సక్తః, పరమే బ్రహ్మణి కోపి న సక్తః** (భ.గో7)

తాత్పర్యం : వ్యక్తి బాలుడుగా ఉన్నంత కాలం ఆటల మీద ఆసక్తి కలిగి ఉంటాడు. యవ్వనములో స్త్రీ పురుష సంబంధమైన విషయాల్లో ఆసక్తుడై ఉంటాడు. వృద్ధుడయినప్పుడు అదికాలేదు, ఇదికాలేదు అని చింతతో సతమత మవుతూ మహాసక్తుడై వుంటాడు. పరమమైన బ్రహ్మపదార్థము మీద ఆసక్తి కలిగి వుండడం ఎవరుగాని చెయ్యరుకదా ! వృద్ధాప్యములో ఏ సాధనను చెయ్యలేరు. కనుక ఇప్పుడు ఇచ్చటనే ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడానికి

ప్రయత్నం చేయాలి అని స్వామీజీ తెలిపారు. స్వామీజీ తాను పొందిన పరమ శాంతి విశ్వమునందు ప్రతి ఒక్కరూ పొందాలని సూచిస్తున్నారు. శ్రీ రామకృష్ణ పరమహంస ఒక కథ చెప్పేవారు.

ముగ్గురు వ్యక్తులు ప్రయాణం చేస్తున్నారు. దారిలో వారికి ఒక పెద్ద గోడ కనిపించింది. ఆ గోడ వెనుక ఏముందో తెలుసుకోవాలని కుతూహలము ముగ్గురుకి కలుగుతుంది. మొదటి వ్యక్తి ఆ గోడను అతిశ్రమపడి ఎక్కి అవతల ప్రక్కకు చూసి అటువైపు దూకేస్తాడు. దూకిన వ్యక్తి ఎప్పటికిరాక పోవడం చూసి రెండవ వ్యక్తి గోడ ఎక్కి దూకాడు. తాను కూడ తిరిగి రాలేదు. చివరికి మూడవ వ్యక్తి కూడ గోడను దూకాడు. మొదటి ఇద్దరు వ్యక్తుల వలేకాకుండా తాను తిరిగి గోడ ఇవతలకు వచ్చి ఆ దారిన వెళ్ళిన వాళ్ళం దరికి గోడ అవతల ప్రక్క మధురమైన ఫలవృక్షాలున్నాయని ఆకలిగా ఉంటే గోడదూకి ఆకలి తీర్చుకోవచ్చునని చెప్తాడు. మహాత్ములు మూడవ వ్యక్తి వంటివారు. పూజ్యఓంకార స్వామీజీ వారు తాను పరమశాంతిని అనుభవించి తానుఅనుభవించిన దానిని అందరును పొందుటకుగాను మనకు శాంతి ప్రార్థనను అందించిరి. ఓ ప్రేమైక మూర్తి నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.

## ఓ తేజోమయమూర్తి !

**నతత్ర సూర్యోభాతి నచచ్న్ద్రతారకం నేమా విద్యుతోభాన్తి కుతోయమగ్నిః**
**తమేవ భాన్త మనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి**

–కఠ అ2. 2వల్లీ మం. 15

ఆ బ్రహ్మ విషయములో సూర్యుడు ప్రకాశించడు, చంద్రుడు నక్షత్ర ములుకూడ ప్రకాశించవు. విద్యుత్ప్రకాశము కూడ అచ్చట లేదనిన ఇంక అగ్ని విషయముపై చెప్పవలసిన పనిలేదు. ఇవన్నియు ప్రకాశించుచున్నవి అంటే అతనిని అనుసరించియే ప్రకాశించుచున్నవి. సర్వమును అతని (బ్రహ్మ) చేత ప్రకాశితమగుచున్నది.

సాధారణమగు కర్పూరహారతి సమయములో ఈ మంత్రమును పఠిం తురు. ఒక భక్తుడు భక్త్యావేశములో భగవంతునకు చిన్న దీప కాంతి చూపగానే మహర్షులయొక్క మహత్ ప్రకటనయగు ఈ భావము అతని మనస్సునకు

వచ్చి ఈ మంత్రమును స్మరించుచున్నాడు. వెంటనే అతడు తేజస్సునకు మూలాధారమైన ఆ పరమాత్మ రూపమును జ్ఞప్తికి తెచ్చుకొన్నవాడై జ్ఞానగాన మగు శ్లోకమును గానము చేయుచున్నాడు.

శుద్ధచైతన్య స్థానమగు హృదయకుహరమందు సూర్యుడు కూడ ప్రకాశించలేడు, దీని వలన హృదయ కుహరములో సూర్యకాంతిని మరుగు పరచు గర్భజనితవాయువులున్నవని అర్థముకాదు. ఇచ్చట సూర్యుడు ప్రకాశ హీనుడగు చున్నాడనగా మిట్ట మధ్యాహ్నపు సూర్యకాంతిలో అగ్గిపుల్ల కాంతి యెట్లు కాంతి విహీనమగు చున్నదో, అట్లా ఆత్మకాంతి యెదుట సూర్యుడు కాంతి హీనుడగు చున్నాడనియే ఇచ్చట భావము. ఉష్ణ ప్రదేశములోని ఎండలో అగ్గిపుల్ల కాంతి విహీనమగుచున్నది. అట్లే ఈ సమస్త తేజస్సులకు మూలా ధారమైన ఆ తేజసత్వము ఆత్మ తేజము ముందర ప్రపంచములో కాంతి దాయకుడగు సూర్యుడు ప్రకాశింపలేడు, ప్రకాశించడు. పోనీ సూర్యుడు ప్రకాశింపకపోతే చంద్ర తారకల కాంతి యున్నదా యనిన నదియు లేదని శ్రుతి చెప్పుచున్నది. ఇది యదార్థమే కదా ! సూర్యుడు ప్రకాశింపలేకున్న అంత కంటే తక్కువ కాంతి కలిగి, దాని నుండి కాంతిని గ్రహించిన చంద్రతార లచ్చట యెట్టు ప్రకాశింప గలవు. సూర్యచంద్రులే యచట ప్రకాశహీనములైన ప్పుడు భక్తుడు తాను భగవంతునకు కర్పూరకాంతిని కనబరుచుట ఎంత మూఢతనమో అని తన అజ్ఞానమును తలచుకొన్నవాడై తనను తానే ప్రశ్నించు కొనుచున్నాడు. 'కుతో యమగ్నిః' ఈ అగ్నికాంతి అచ్చట యేపాటిది, అని గీతలో భగవానుడు ఇదే విషయము చెప్పారు.

**నతద్భాసయతే సూర్యః, నశశాంకో న పావకః ।** భ.గీ. 15-16

ఆత్మతేజాన్ని సూర్యుడు, చంద్రుడు అగ్ని వెలిగించరు. సూర్యచంద్రులు ప్రపంచంలో వస్తువులను వెలిగించి చూపుతారు. ఎలా అయితే సూర్యుడు ముందు చంద్రుడు అగ్ని వెల వెలా పోయి సూర్యుణ్ణి వెలిగించి చూపలేవో, అలాగే వెయ్యి సూర్యులు వెలుగు కన్నా ఎక్కువ కాంతివంతమైన భగవంతుణ్ణి ఈ మూడు వెలుగులు వెలిగించి చూపలేవు.

ఇచ్చట శ్రుతి తేజో దాయకములు, భౌతికపదార్థములను ఉదాహరణగా చెప్పినప్పటికి ఈ వాక్యమిచ్చట సమస్త జ్ఞానమునకు అన్వయించుచున్నది. సమస్త పదార్థములు మనకు ఆత్మయొక్క ప్రకాశముతోనే తెలియబడుచున్నది.

ఒకసారి ప్రత్యేక వ్యక్తిలో ఆ తేజస్వరూపము ప్రాణతత్త్వం జారి పోగానే బాహ్య ప్రపంచములో పదార్థ జ్ఞానము, అంతర ప్రపంచములోని భావముల జ్ఞానము కాని అతనికి ఉండదు. జ్యోతి స్వరూపుడై ఆ బ్రహ్మం మనలో నుండి ప్రకాశిస్తూ ఉండడం వల్లనే మనం ఈ లోకం గురించి తెలుసుకొన గలుగుచున్నాము. ఆయన మనలో లేకపోతే తెలుసుకోవడమనేది అసాధ్యం. ఆయన తేజో స్వరూపాన్ని అర్జునునకు చూపించాడు. ఆ తేజ స్వరూపము ఎలా ఉంది అంటే ?

**దివి సూర్య సహస్రస్య భవేద్ యుగ పదుత్థితా**
**యది భాస్సదృశీ స్యాత్ భాసస్తస్య మహాత్మనః** భ.గీ. 11-12

తాత్పర్యం : ఆకాశంలో ఒక్కసారిగా వేయి సూర్యులు ఉదయిస్తే ఏర్పడే కాంతి ఆ మహాత్ముని తేజస్సుకు సాటిరాగలదు. ఒక్క సూర్యునే మనము చూడలేము, అటువంటి వేయి సూర్యుల తేజస్సు గ్రహించాలి అంటే జ్ఞాన చక్షువులతోనే దర్శించగలరు తప్ప ఈ చర్మ చక్షువులతో కాదు. ఆయన తేజము కారణముగానే సూర్యచంద్రులు, అన్ని వెలుగుతున్నాయి. కనుక ఆ పరమా త్మను 'జ్యోతిష్మాన్ బ్రహ్మ' (చాందోగ్య) తేజోమయమూర్తి అన్నారు.

**తూర్పు, పడమరల, ఉత్తర దక్షిణముల ఈ విశ్వమందంతటను అందరును, నీ దివ్య తేజస్సును గ్రహింతురుగాక!**

తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల ఈ నాలుగు దిక్కులు కలిసి ప్రకాశవాన్ బ్రహ్మ అనబడుతుంది (ఛాందోగ్య) ప్రకాశవాన్ బ్రహ్మ అంటే వ్యక్తి కలిగి ఉండే జ్ఞానం, జ్ఞానశక్తి. అతని వ్యక్తిత్వంలో భాగం ఇది, అతని లోపల ఉంటుంది. ఈ విషయం ఛాందోగ్యోపనిషత్తులో మొదటి గురువయిన వృషభంచేత బోధింపబడినది. ప్రకాశవాన్ బ్రహ్మను గూర్చి వివరంగా పరి శీలిద్దాం! వృషభం ఉపదేశము (నిరుక్తము 1-23) వర్షితః ఆపాం వాసనలనే నీటిని వర్షించి పోగొట్టటం (నిరుక్తము 9-22) వర్షనాత్-వృషభః క్రిందకి వర్షిస్తుంది. అతి బృహతి తేతః-ప్రవాహవేగాన్ని వృద్ధిచేసేది (జ్ఞానాన్ని) వాసనలు రాలిపోయి తగ్గగానే అజ్ఞానపు పొర పలుచబడుతుంది. ఫలితంగా సాధకుని ఇంద్రియాలు అతని అధీనంలోనికి రావటంవల్ల అతను గ్రహించ గలుగుతాడు. దాని వలన అతని జ్ఞానం చెదిరిపోకుండా స్థిరంగా ఉండటాన్ని గుర్తిస్తాడు. ఇదంతా దేనివలన జరిగిందో తెలుసుకుంటాడు. ఈ విధంగా

వాసనలు వర్షించడంలోనే జీవితం యొక్క స్వభావమేమిటో ప్రయోజన మేమిటో సాధకునకు స్పష్టంగా బోధపడుతుంది. దిశః (ని. 2-15) దిశతేః సూచించేది. తూర్పులో ఉదయించటంమంటే జననం. పడమటలో అస్త మించుటమంటే మరణం. ఈ రెండింటికి మధ్య ఉన్నదే జీవితం. ఈ జీవిత కార్యకలాపాలను దీక్షతో నిర్వహిస్తూ అందులో నిమగ్నమై పోవటం దక్షిణం. ఉద్ధరణవైపుగా ప్రయత్నించటం ఉత్తరం, గతంలో చేసిన కర్మలఫలితమైన ప్రారబ్ధంవల్ల ఈజన్మవస్తుంది. ఈజన్మ వచ్చినతరువాత అస్తమించే సమయము లోపల 'దివ్య తేజస్సును' గ్రహించాలి. దివ్య తేజస్సు అంటే ? దివ్య తేజస్సు **'స ఏవ జ్యోతిషాం జ్యోతిః'** (స్కందోపనిషత్తు) జ్యోతులకు జ్యోతి.

ప్రపంచంలో అనేక వెలుగులున్నాయి. సూర్యచంద్రులు, నక్షత్రాలు, విద్యుత్, అగ్ని, ఈ ఐదు జడమైన వెలుగులు. జడప్రపంచాన్ని వెలిగిస్తాయి. కాని వాటికి జ్ఞానంలేదు. తాము వెలిగించే వస్తువులేమిటో అవి తెలుసుకో లేవు. చైతన్యవంతుడైన జీవుడిలో తెలివి కూడిన వెలుగులు చాలా ఉన్నాయి. ఐదు ఇంద్రియాలలోను ఐదు రకాల వెలుగులున్నాయి. ఆకారాలని, శబ్దాలని, రుచులని, వాసనలని స్పర్శలని వెలిగించే శక్తులని వెలిగించడమేకాదు, అవి తెలుసుకుంటాయి కూడాను. మనస్సులో మరోరకమైన వెలుగు ఉన్నది. ఇంద్రియాలు వేరు వేరుగా పంపే వార్తలను సమన్వయం చేసుకొని విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకొనే వెలుగది. ఉద్రేకాలు పొందుతూ ఫలానా ఉద్రేక మని గ్రహించే నేర్పు అది. బుద్ధిలో ఉన్నది విచక్షించే వెలుగది. నిర్ణయాలు తీసుకో గలదు. ఇన్ని వెలుగులకు ఆధారమైనది, వెలుగు నిచ్చేది, వాటిని గ్రహించేది, జ్యోతులకు జ్యోతి, పరమాత్మకాంతి, అదే అన్నింటికి అధిపతి. అది లేకపోతే సర్వము నిలిచిపోతుంది. సర్వాన్ని కనిపెట్టి చూస్తూ నియమించే పరమేశ్వరుడు అదే. తనకు తానుగా నిలచి ఉండే దివ్య తేజస్సూ అదే. అందుకే గజేంద్రుడు ఈ విధంగా భగవంతుని ప్రార్థిస్తాడు.

**లోకంబులు లోకేశులు, లోకస్థులు దెగినతుదిన లోకంబగు**
**పెంజీకటి కవ్వల నెవ్వండేకా కృతి వెలుగునతని సేవింతున్**(భాగవతం)

తాత్పర్యం : లోకంబులు, లోకేశులు, లోకస్థులు తెగిన తుది అలోకం బగు పెంజీకటి కవ్వల ఏకాకృతిని వెలుగుచున్న వానిని సేవించెదను.

లోకంబులు – లోకము అంటే ఆలోకించేది – జాగ్రత్త అవస్థలో అనుభవాలు పొందేది.

లోకేశులు–లోకములో శబ్ద,స్పర్శ,రూప,రస,గంధ, అనుభవాలు పొందాలి అంటే విషయవస్తువులు, ఇంద్రియాలు ఉండాలి. అయితే విషయ వస్తువులు, ఇంద్రియాలు ఉంటే అనుభవం వస్తుందా ! ఒక రూపాన్ని చూడాలి అంటే కన్ను ఉండాలి, కంటికీ, రూపానికి సంబంధం ఉండాలి. సంబంధం ఉంటే అనుభవం వస్తుందా ? రాదు. అది ఎట్లా అంటే, బల్లమీద భగవద్గీత పుస్తకంవుంది. నేను తీసుకోవాలి అనుకున్నాను. ఇంతలో విద్యుత్తు పోయింది. అంతా చీకటి. కన్ను వుంది పుస్తకము వుంది. పుస్తకం కనిపిస్తుందా ? కనిపించదు.

ఎవరు ఎందువలన, కనిపించలేదంటే, పుస్తకాన్ని చూపించే వెలుగు లేదు. పుస్తకాన్ని చూపించే వెలుగు ఉండాలి. కంటికి అధి దేవతసూర్యుడు. ప్రతీ ఇంద్రియాలకి అధిదేవతలు ఉన్నారు. అధి దేవతశక్తి ఉంటేనే ఇంద్రియాలు శక్తివంతముగా ఉంటాయి. ఈ అధిదేవతలే లోకేశులు (నియామకులు), లోకస్థులు–అనుభవించేవారు. అనుభవించేవాడు, అనుభవించే వస్తువు. ఈ రెండింటికి మధ్యవుండే సంబంధం అధిదేవత ఈ మూడింటిని వేదాంత పరిభాషలో త్రిపుటి అంటారు. ఈ మూడు 'తెగినతుది'నాశనమయినప్పుడు, అలోకంబగు అంటే ఏమిలేని స్థితి, ఏ అనుభవములేదు. పెంజీకటి కవ్వల ఎవ్వడు ఏకాకృతి–రాముడా, కృష్ణుడా, శివుడా, ఎవరుకాదు. నిర్గుణమును (దివ్యతేజస్సు) సేవిస్తాను. భగవంతుని జ్యోతిస్వరూపుడు అన్నారు. అంటె బాహ్య కాంతి కాదు. అందుకే వివేకానంద అంటారు. "It is light without any property" అది కాంతియే కాని కాంతికున్న భౌతిక లక్షణాలు లేవు. సూర్య ప్రకాశము పగలు ఉంటుంది, చంద్రుని వెన్నెల శుక్లపక్షములో ఉంటుంది.

బాహ్యకాంతి ప్రసరిస్తూ చీకటిని నశింప జేస్తుంది. కాని దివ్య తేజస్సు చీకటిని కూడ వెలిగిస్తుంది. అంటే అంతా చీకటిగా ఉన్నది. అంతా చీకటిగా ఉన్నదని మనకు చెప్పింది ఎవరు ? లోపల దివ్య తేజస్సు అంతా చీకటి అని బుద్ధికి చెప్పితే ఇది అంతా చీకటని మనము గుర్తిస్తాము. కారణ శరీరము సుషుప్తి అవస్థలో అంతా శూన్యము, ఏ అనుభవము లేదు. కారణ

శరీరములో బుద్ధిలేదు. అయినప్పటికి ఇది అంతా శూన్యమని దివ్య తేజస్సు తెలియజేస్తుంది. జాగ్రత్త, స్వప్న, సుషుప్తి మూడు అవస్థలను వెలిగించే చైతన్యం ఇది. దీనిని తురీయావస్థ అంటారు. కారణ శరీరములో సుషుప్తి అవస్థ వెనుకాల (పెంజీకటి అవ్వల) చీకటిని వెలిగించే దివ్య తేజస్సును ఆరాధించెదను. తెలుసుకున్న అనుభవజ్ఞుడు ఆ వెలుగుగానే నిలచిపోతాడు. (తూర్పు) మానవ జన్మ లభించిన పిమ్మట, (పడమర) అస్తమించే లోపల (దక్షిణం) దక్ష్ విషయ వాసనలను ఎక్కువ చేసుకోకుండా ప్రస్తుత జీవితంలో మనము జీవితాన్ని పరిశీలించి చూడాలి. ఉత్+తర=పరిమితులను అధిగమించి దివ్య తేజస్సును గ్రహించడానికి పురుష ప్రయత్నము చేయాలి. ఆ దివ్యతేజస్సును తెలుసుకున్న అనుభవజ్ఞుడు ఆ వెలుగుగానే నిలిచిపోతాడు. ఆ పరబ్రహ్మనే నేను అని నిస్సంశయముగా తెలుసుకుంటాడు. ఇది ఒకరు ఇచ్చేదికాదు. తెచ్చుకునే హోదాకాదు. సరియైన జ్ఞానముతో ఆ దివ్య తేజస్సును ఈ విశ్వములో అందరమూ గ్రహించెదము గాక.

## ఓ సచ్చిదానంద స్వరూపా

సత్–భూత భవిష్యద్, వర్తమానాలలో (త్రికాలలోనూ) మార్పుచెంద కుండా స్థిరంగా ఉండేది సత్ అనబడుతుంది.

చిత్–వస్తు విషయ జ్ఞానం. వస్తువును బట్టి మారుతూ ఉంటుంది. ఈ జ్ఞానం వలననే మిగిలిన అన్ని జ్ఞానాలూ సంభవం అవుతున్నాయి. ఇది వస్తు రహిత జ్ఞానం. కేవల విజ్ఞాన ఘన స్వరూపం–విశుద్ధ బోధయిది.

ఆనందస్వరూపము అన్ని సమయాల్లోనూ, ఎల్లప్పుడు, నిత్యము. ఈ ఆత్మ ఆనంద పూర్ణమే. ఆనంద ఘనమే. దీనిలో ఛాయా మాత్రంగానైనా దుఃఖం లేని కారణంగా దీనిని ఏ సుఖముతోనూ పోల్చిచూడలేము, సరితూచ లేము. అందుకే ఇది పూర్ణం, ఆనందఘనం. శరీరము, మనస్సు, బుద్ధి, చూచువాడు, అనుభవించువాడు. ఆలోచించువాడు, వస్తువులు, ఉద్రేకాలు, ఆలోచనలు ఇవే సర్వ దుఃఖాలకు కారణాలు. వీటికి అతీతమైనది కాబట్టి వాటి లక్షణాలయిన ద్వంద్వాలేవీ ఉండవు, ఈ స్థితిలో ఆనందం ఉంటుంది. ఆనందమే దీని స్వభావం. ఎక్కడచలనం ఉంటుందో అక్కడ బాధ ఉంటుంది. కాబట్టి మన ప్రస్తుత అనుభవాల దృష్టితో చూసినప్పుడు ఆత్మ ఆనందఘనంగా వర్ణింపబడినది.

ఈ శాంతి ప్రార్ధనలో ప్రారంభములో కేనోపనిషత్తులో శిష్యుడు వేసే ప్రశ్నకు సమాధానంగా నేత్రములకు నేత్రము అని స్వామీజీ వారు చెప్పారు.

1. వ్యక్తిలో ఉన్న ఇంద్రియాలు, మనస్సు ప్రేరేపించి బైటకు పంపే దెవరన్న ప్రశ్నకు సమాధానంగా, ఇంద్రియాలు, మనస్సును వాడుకునేవాడు వాటి వ్యాపారాలను తెలుసుకునేవాడు సర్వము బ్రహ్మమేనని గురువు సమాధాన మిచ్చాడు.

2. ఈ బ్రహ్మము ఎవరి వల్ల తెలుసుకొనబడుతుంది. ఆత్మను ఆత్మే తెలుసుకుంటుంది. బుద్ధిచేత తెలుసుకొనబడదు అని చెప్పబడినది. (ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా !)

3. ఎవరిచేత ఈ జిజ్ఞాస కలుగుతుంది ? ఎవరీ యక్షుడు అనే జిజ్ఞాసతో ప్రశ్నించే స్థితి భగవంతుడే కలిగిస్తాడు.

4. పురుష ప్రయత్నం గురించి చెప్తున్నారు. గురువు గారి ఉపదేశము విన్న తరువాత ఒక శిష్యుడు ప్రశ్నించాడు.

**ఉపనిషదం భో బ్రూహీ తి ఉక్తాత ఉపనిషద్బ్రాహ్మీం వావత ఉపనిషద మబ్రూమేతి ॥** కేన.ఉ. 4 ఖం.మం.7

శిష్యుడు అడిగాడు, 'స్వామి! ఉపనిషత్తుని బోధించండి.' గురువు జవా బిచ్చాడు.నాయనా! బ్రహ్మానికి చెందిన ఉపనిషత్తు చెప్పబడినది. నీకు ఉపనిషత్తు బోధించడమైనది. నాలుగు అధ్యాయాలు ముగిశాయి. ఇప్పుడు ఒక శిష్యుడు అడిగాడు. 'ఉపనిషత్తుచెప్పరా' అని. ఇంతవరకు చెప్పినది అతడు వినలేదా ? ఇంతవరకు చెప్పినది వినని వాడయితే మళ్ళీ చెప్పమని అడిగేంత శ్రద్ధ ఉండదు. అందు వల్ల అతనికి చాలకనే అడిగినట్లు స్పష్టం.

ఉపనిషత్తు రెండు ప్రయోజనాలని సాధించుతుంది. ఉప–పరమాత్మను గురించిన నిశ్చయమైన షత్– జ్ఞానము. అంటే పరబ్రహ్మమును గురించిన సరియైన జ్ఞానాన్ని కలిగించేది ఉపనిషత్తు. ఇది బ్రహ్మమునకు చెందిన ఉపనిషత్తు అని మాత్రమే చెప్పాడు గురువు. మరో ప్రయోజనం అజ్ఞాన బంధనాలని చేధించేది. ఉపాయాలను సూచించడం ఉపని–ఉప నిహంతి షత్–అవిద్యామ్ అంటే అజ్ఞానాన్ని ఛేదిం చేది. లోకబంధాలన్ని ఛేదించడానికి తగిన సాధనలు చేయించేది ఉపనిషత్తు. ఇది ఇంత వరకు చెప్పలేదు. ఇంకా ప్రాపంచిక వ్యామోహంలో ఉన్నవారికి ఆ ఉపదేశం కూడా కావాలి. లేకపోతే

బ్రాహ్మీ ఉపనిషత్తువల్ల వాళ్ళకి ప్రయోజనం ఉండదు. శిష్యుని అవసరం గురువుగారు గ్రహించారు. అందువల్ల ఒక ఉపదేశం కూడ చేస్తున్నాడు.

**తస్యై తపోదమః కర్మేతి ప్రతిష్టా వేదాః**
**సర్వాంగాని సత్యమాయతనమ్ ॥** కేన. 4ఖం. మం. 8

దానికి పునాది తపస్సు, ఇంద్రియ నిగ్రహం, నిష్కామకర్మ. అన్ని శాస్త్రాలు దాని అంగాలే. సత్యమే భవనం.

ప్రాపంచిక బంధనాలు నశింపచేయడానికి చేయవలసినది శారీరకమైన తపస్సు, ఇంద్రియాల సంపూర్ణ నిగ్రహం, నిష్కామ కర్మలు. తపస్సువల్ల శారీరక అవసరాలు తగ్గుతాయి. ఇంద్రియ నిగ్రహం వల్ల మనస్సులో కోరికలు తగ్గుతాయి. నిష్కామకర్మ వల్ల వాసనలు క్షయమవుతాయి. భౌతిక విద్యలన్నీ భగవంతునికి అంగాలని తెలుసుకుంటే వాటిమీద వ్యామోహం నశించి వాటిద్వారా భగవంతుని చేరుకోవడానికి ప్రయత్నిస్తాము. మనో వాక్కర్మలతో సత్యవ్రతాన్ని పాటిస్తే వారి వ్యక్తిత్వం పరమాత్మను చేరుకోవడానికి ఆయత్తమౌతుంది.

కేనోపనిషత్తులో గురువు శిష్యునకు ఉపదేశం చేసిన విధంగానే శ్రీ స్వామీజీ వారు సాధకులకు ఉపదేశం చేసారు.

**ప్రతీ మానవ హృదయమందును నానా జాతి మధ్యమము**
**నందును శాంతి సామ రస్యములను ప్రతిష్ఠింప జేయుము**

సాధకులు చేయవలసిన పురుష ప్రయత్నాన్ని గూర్చి చెప్పారు. పరమ శాంతిని పొందాలి అంటే శాంతి సామరస్యములు ఉండాలి. గురువు శిష్యునకు ఉపదేశించిన తపస్సు, ఇంద్రియ నిగ్రహము, నిష్కామ కర్మ అన్ని శాస్త్రాలు దాని అంగాలే. సత్యమే భవనం. ఈ అర్హతలన్నీ శాంతి సామరస్యాలు పొందడానికి ఉండాలి.

### శాంతి-సామరస్యము

ప్రస్తుతము మనం పరిమితులకు లోబడి బాహ్యాంగాను, అంతరంగంగాను అనేక సమస్యలకు వశమై జీవిస్తున్నాము. బాహ్య విషయాలవల్ల సవాలులు మనస్సుపై బడినప్పుడు మన జీవితాలు దుఃఖమయమవుతున్నాయి. తత్త్వవేత్తలైన ఋషులు జీవితంలో ఎదురవుతున్న పరిస్థితులకు చలించకుండా సంభవించిన సంఘటనలను అర్థం చేసుకుని నిశ్చలమైన

బుద్ధితో సరియైన నిర్ణయం తీసుకొని పరిష్కరించుకోవడం వల్ల జీవితం ఆనందంగా ఉంటుందని నిర్ణయించారు. ఇటువంటి జీవితం కొంతకాలము గడపటం వల్ల మనస్సు సమత్వస్థితిని పొంది అంతరంగములో శాంతి లభిస్తుంది. దీనివల్ల మనకు కలుగుతున్న భయాందోళనల నుండి మనస్సు అలజడి చెందకుండా ఉంటుంది. ఒకదానితో మరొకటి పోటీపడుతూ నైతిక విలువలు తగ్గిపోయిన ఈ ప్రపంచములోని వస్తువులతోటి సంబంధం పెట్టుకుని తప్పనిసరిగా ప్రతీవ్యక్తి జీవించవలసి వస్తుంది. అంతరంగము నుండి బయటికి వస్తున్న కోరికలకు, అనంతమైన దురాలోచనలకు వశమై నిస్సహాయంగా జీవించడం జరుగుతుంది. ఈ ఆధునిక ప్రపంచంలో వ్యక్తి మారుతున్న విషయ వస్తువులలోనూ, అంతరంగంలో కలుగుతున్న అలజడుల తోనూ సతమతమైపోతూ దిక్కు తోచని నిస్సహాయస్థితిలో ఉండిపోతున్నాడు.

బయట నుంచి కలుగుతున్న బెదిరింపులకు సవాలులకు మళ్ళీ మనస్సు వశమై వాటి నుండి తప్పించుకోలేకపోతున్నాము. ఒక వ్యక్తి తనకు కలిగిన భయాందోళనకు వశంకాకుండా నిలబడడంలోనే ఆవ్యక్తి సంపాదించిన ఆనందము యొక్క రహస్యము దాగి ఉన్నది. ఒకానొక సమయములో అంతు పట్టని అగాధమైన పరిస్థితులు, పరిసరాలు మనని అంధకారంలోకి తోసేస్తుంటాయి. పరిష్కారము దొరకని మనస్సు అనేక చింతలకు గురి అవుతుంది. ఇటువంటి జటిలమైన పరిస్థితులు అంతరంగములోని మనోబుద్ధులను బలహీన పరచి సమస్యలను ఎదుర్కొనే శక్తి తగ్గిపోయి అశక్తుడవుతున్నాడు. దీని వల్ల మనస్సు మరింత కృంగి కృశించి పోతుంది. ఎంతో అనుభవజ్ఞులైన మతగురువులు మనస్సును శాంతిగా సామరస్యముగా ఉంచాలని నిశ్చయానికి వచ్చారు.పరిమిత తత్త్వము గలిగి స్వార్థ పరమైన సమస్యలను ఎదుర్కోవాలని అంటే సామరస్యమైన జీవితం ఉండాలి.

ప్రపంచం గురించి ప్రపంచంలో విషయాలను గురించి సమిష్టి సంబంధమైన సమస్యల గురించి సంపూర్ణమైన అవగాహన పొందడానికి తగిన మనస్సును స్థిరపరచుకోవాలి. ఈ విశాల విశ్వములో సమస్యలను అర్థం చేసుకొనే శక్తి మనస్సుకు కలిగినప్పుడు మనస్సు నిలకడ చెంది వ్యక్తిగత సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించు కొనే శక్తి కలిగి ఉంటుంది. సమిష్టి సమస్యలను అర్థం చేసుకున్న వానికి వ్యక్తిగత సమస్యలను పరిష్కరించ

డంలో పెద్ద సమస్య అనిపించదు. సమాజపరమైన సమస్యలయొక్క సంపూర్ణ జ్ఞానం లేకపోవడం వల్ల వ్యక్తిగత సమస్యలు మిక్కిలి బాధాకరంగా కనిపిస్తాయి. అంతరంగంలోను బయట ప్రపంచంతోటి సామరస్యములేని వ్యక్తి ప్రక్క వాయిద్యాలతో సంబంధం లేకుండా శృతి, తాళము లేకుండా తనకు తోచిన రీతిలో పాడిన గాయకుని వలె ఉంటాడు.

ప్రపంచంలో సామరస్యంతో జీవించడం అంటే గుడ్డిగా పరిస్థితులకు లొంగిపోయి జీవించడం అనిగాని, తెలివితక్కువగా సమస్యలకు వశమై పోవడం అనికాదు. చేతకాని తనమువల్ల ధైర్యసాహసములు లేకుండా సరి పెట్టుకోవడం మరణము కంటే హీనమైనదని శాస్త్రాలు సూచిస్తాయి. సమ స్యను అర్థం చేసుకోవడంలో కలిగిన సామరస్యము కళాసృష్టికి కారణభూతు డైన సృష్టికర్త యొక్క శాంత స్థితిగా గురువులు వర్ణించారు.

ఈ సమరస భావాన్ని నిత్య జీవితంలో వ్యవహారాలను చక్క బరుస్తున్న ప్పుడు అన్ని రంగాలలోను ఎటువంటి ఒడుదుడుకులు కలిగినా ఆచరణలో పెట్టగలగాలి. సమిష్టి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడం వలన కలిగిన అనుభవజ్ఞానాన్ని నిత్యజీవితంలో అన్వయించుకున్నప్పుడు అతని జీవితం సంతోషంగాను, శాంతంగాను ఉంటుంది. మనస్సులో శాంతము– సామరస్యము కలిగినప్పుడు సూర్యకాంతిలో మంచుబిందువులు కరిగిపోయి నట్లుగా మనకు కలిగిన సమస్యలు కూడా కరిగి పోతాయి. శాంతి సామరస్య మైన జీవితం జీవించడానికి మనస్సును సమత్వంగా ఎలా వుంచుకోవాలో మహాత్ములు తెలిపారు. మహాత్ములు అందించిన సూత్రాలను ఆధారంగా చేసుకొని ఆత్మ నిగ్రహం సంపాదించి వాటిని ఆచరణలో పెట్టి మానవత్వపు విలువలను సంరక్షించినవాడు శాంతిని పొంది తద్వారా పరమశాంతిని పొందుతాడు.

పరమశాంతిని పొందడం మూలంగా ప్రయోజనమేమిటి? ఎవరయితే ఈ ప్రకారంగా ఆచరించి పరమశాంతిని (ఆత్మతత్త్వమును) తెలుసుకుంటాడో, అతడు పాపాలను నశింపజేసుకొని అనంత స్వర్గంలో జయము పొంది ప్రతిష్ఠితుడౌతాడు.

ఇతరులకు హానిచేసే కార్యాలను పాపాలంటారు. అయితే ఈ పాపాలకు నాంది మనలోని వాసనలే. పాపపు వాసనలు, పాపపు కోరికలను సృష్టించి

పాపపు పనులు చేయిస్తాయి. వ్యక్తి ఎప్పుడయితే ప్రార్థన చేస్తూ వుంటాడో, అతనిలో పాపపు ఆలోచనలు రావడానికి అవకాశము వుండదు. అవకాశము లేకపోతే ఇంక పాపము ఎక్కడ? అందుకని ఈవిధంగా పరమశాంతి పొంది నప్పుడు పాపపు ఆలోచనరాదు. ఆలోచన రాకపోవడమే పాపము నశింప జేయడము.

అనంత స్వర్గలోకం-ఇంద్రుడుండే స్వర్గం అనంతంకాదు. తన మనస్సు స్థాయిలో ఉండి, స్వర్గసుఖ భోగాలనుభవించి, 'క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి' (భ.గీ) పుణ్యం క్షీణించిన తరువాత భూలోకంలో పడడంకాదు. అనంత స్వర్గంఅంటే పరమశాంతి స్థానము "స్వర్గ" అంటే "స్వ+గ" ఆత్మవైపు పయనించడం, అక్కడకు చేరుకున్న వారు మరిక్రిందకు రావడం అంటూ ఉండదు. అదియే పరమమైన శాంతి ధామము.

## ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన

'దానాత్ దేవః' ప్రకృతి సంపదను యావత్తును నిచ్చేవాడు.

'ద్యోతనాత్ దేవః।' జడ ప్రపంచమును వెలిగించే వాడు.

సాధారణముగా అందరము ప్రార్థన చేస్తూ ఉంటాము. కాని స్వామీజీ వారు సూచించిన పరమశాంతి ధామమును పొందలేకపోతున్నాము. అందు కని స్వామీజీ వారు యాంత్రికముగా గ్రామ్‌ఫోన్ రికార్డువలె ప్రార్థన చేస్తే ఏవిధమైన ప్రయోజనము ఉండదని ఒక ముఖ్యమైన సూచన ఇచ్చారు. అదియే మనఃపూర్వకమైన ప్రార్థన చేయాలని ఆదేశించిరి. ఇదే విషయము శంకరాచార్యులు ఒక ఉదాహరణ ద్వారా వివరించారు.

**నగచ్ఛతి వినాపానం వ్యాధిరౌషధ శబ్దతః**
**వినాపరోక్షానుభవం బ్రహ్మ శబ్దైర్న ముచ్యతే ॥** (వి.చూ. 64శ్లో)

తాత్పర్యం : మందుపేరును స్మరించడం వలన వ్యాధి నయం గాదు. ఔషధాన్ని సేవించి తీరాలి. 'బ్రహ్మం' అనే పదాన్ని జపించడం వలన ముక్తి లభించదు. బ్రహ్మానుభవాన్ని పొందితీరాలి.

కేవలం మంత్రాన్ని జపించడం ఏవిధంగా ఎందుచేత నిష్ఫలమో ఇచ్చట వివరింపబడినది. అజ్ఞాన బాధితుడు బ్రహ్మం అనే పేరును జపించడం వలన ఏవిధంగాను ప్రయోజనాన్ని పొందలేడు. ఆ బ్రహ్మతత్వం ఏమిటో స్వయముగా అనుభవించి పొందాలి. యాంత్రికంగా 'హంసస్సోహం' వంటి

మంత్రాలను జపించడం వలనగాని, 'అహం బ్రహ్మాస్మి' అని పదేపదే స్మరించడంవల్ల కాని ఏ ప్రయోజనం కలుగదు. ఔషధం ఎంత గొప్పదయినప్పటికి ఔషధనామాన్ని పదేపదే స్మరించడం వలన రోగి వ్యాధి నుండి విముక్తిని పొందలేడు.

ఏస్పరిన్ అంటూ గంటల తరబడి జపించినా తలనొప్పి తగ్గదు, సరికదా మరింత ఎక్కువవుతుంది. తలనొప్పి నుండి విముక్తిని పొందాలంటే ఏస్పిరిన్ సేవించి తన తత్త్వంలో జీర్ణించే వరకూ వేచి ఉండాలి. అప్పుడు మాత్రమే తలనొప్పి నుండి విముక్తి కలుగుతుంది. ఔషధమే తానుగ మారిపోయినప్పుడు మాత్రమే బాధ ఉపశమిస్తుంది. బాధారహితమై ఆనందమయిన స్వస్థితిలో ఉండగలుగుతాము. అదేవిధంగా పరమ పవిత్రమయిన 'శాంతి ప్రార్థన'ను జపించడం వలన ఏ విధమైన ప్రయోజనము వుండదు. శాంతి ప్రార్థన సూచించే పరమశాంతి, పూర్ణత్వ స్థితిని అర్థం చేసుకొని పవిత్రముగా జీవితాన్ని సాగించాలి. శాంతిప్రార్థన సత్యాలను నిత్య జీవితానుభవాలుగా మలచుకోవాలి. శాంతి ప్రార్థన విలువలను నిత్య జీవిత సోపానములుగా సహజముగా అప్రయత్నంగా జీవించడంలో స్వభావంగా మార్చుకోవాలి. సూచింపబడిన పరమ పవిత్రమైన శాంతిని, పరమశాంతిని (ఆత్మతత్త్వము) తానుగా స్వానుభవంతో తెలుసుకొని ఆ అనుభవంలో ప్రతిష్ఠ పొందాలి. అలా ప్రతిష్ఠ పొందడమే పరమ శాంతి ధామము అంటారు.

కర్కశమైన సూర్యతాపముచే వేడెక్కిన భూమిని చంద్రుడు చల్లబరచినట్లు. అశాంతితో సతమతమవుతున్న మానవాళికి పూజ్య స్వామీజీ వారు పరమశాంతిని అనుభవించి తాను అనుభవించిన పరమశాంతిని చంద్రునివలె అవ్యాజ కరుణాస్వరూపులై శాంతి ప్రార్థనను మానవాళికి అందజేసిరి.

యాంత్రికముగా ప్రార్థించడము వ్యర్థము అన్నారుకదాయని శాంతి ప్రార్థన చేయడము వృధాయని భావనకాదు. నిత్యము ప్రార్థన చేస్తూ వుంటే ఏదో ఒక దినమున దాని అర్థమును గ్రహించ గలిగి స్వామీజీ వారు పొందిన పరమశాంతి ధామము (ఆత్మానుభవము) పొందగలము.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు. – ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ప్రార్థన చేయుటవలన ఆదిదైవిక, ఆదిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు, ఆటంకములు శాంతించును గాక !) జై గురు దేవ అర్పణమస్తు.